RNI No: TELTEL/2013/50413
సంపుటి: 13, సంచిక: 97
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 23.01.2026 హైదరాబాద్
పేజీలు: 12
వెల: ₹5
www.mudranews.in
www.youtube.com/@MudraNews
www.instagram.com/mudradaily
www.x.com/MudraDaily
Published From: Hyderabad | Amaravathi | Vijayawada

## 375 కిలోమీటర్లు..
### ఇదీ పులి ప్రయాణం
మహారాష్ట్ర - యాదాద్రి.. 19 జిల్లాల మీదుగా జర్నీ
03



## ఇదో విచిత్రమైన ముద్ర

లియోనార్డో డా విన్సీకి ఒక అద్భుతమైన ప్రతిభ ఉంది. ఆయన ఒక చేతితో రాయగలిగే సమయంలో మరో చేతితో చిత్రాలు గీయగలిగేవారు! అసలైన మేధావి, బహుముఖ ప్రతిభకు నిదర్శనం



## మినీ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హైదరాబాద్ వేదిక
### ఫాలో అప్ సదస్సు నిర్వహణకు ఫోరం ప్రతినిధుల హామీ



- నిర్ణయాల పురోగతిని సమీక్షకు సదస్సు దోహదపడుతుందని వ్యాఖ్య
- కీలక ప్రతినిధులతో సీఎం బృందం భేటీ
- ఇప్పటికే చైనాలో సమ్మర్ దావోస్.. ఆసక్తి కనబరుస్తోన్న సౌదీ అరేబియా
- ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్
- శంషాబాద్ , గాగిల్లాపూర్ లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ..

10

# చేరికల చిచ్చు
### కాంగ్రెస్‌కు శాపంగా మారిన ఫిరాయింపు రాజకీయం!

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో ముప్పు
అదనపు బలం అనుకుంటే.. తీరని తలనొప్పి
మున్సిపల్ పోరుపై నీలి నీడలు
పటాన్ చెరు, గద్వాలలో వింత పరిస్థితి

- పాత వర్సెస్ కొత్త: తగ్గని ఆధిపత్య పోరు
- జగిత్యాలలో సమన్వయ లోపం
- అనర్హత వేటు భయం.. ద్వంద్వ వైఖరి
- దానం నాగేందర్ ఎపిసోడ్: డైలమాలో సర్కార్
- వ్యూహాత్మక తప్పిదంగా మారిన ఫిరాయింపులు
- నైతిక బలాన్ని కోల్పోతున్న హస్తం
- క్లీన్ స్వీప్ ఆశలు.. ఉనికి కాపాడుకునే సవాళ్లు
- సొంత పార్టీ నుంచి విమర్శలు
- జిల్లాల్లో తగ్గని విభేదాలు

ముద్ర, తెలంగాణ బ్యూరో

*బీఆర్ఎస్‌ను బలహీనపరచాలనే వ్యూహంతో చేర్చుకున్న పది మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీకి 'మింగుడు పడని మెతుకు'లా మారారు. అదనపు బలం వస్తుందని ఆశిస్తే.. క్షేత్రస్థాయిలో సొంత పార్టీ క్యాడర్‌తో విభేదాలు, అనర్హత వేటు భయంతో ఎమ్మెల్యేల ద్వంద్వ వైఖరి పార్టీని ఆత్మరక్షణలో పడేశాయి. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఈ 'వలస' నేతల తీరుతో అటు పాత కాంగ్రెస్ శ్రేణులు, ఇటు కొత్తగా చేరిన వారు కలవలేక పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.*




04

## మీడియా స్వేచ్ఛకు ముప్పు
04
### తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి




తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు రక్షణగా ఉన్న 'వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్'ను రద్దు చేసి, దానిని ఇతర కార్మిక చట్టాలతో కలిపి 'ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ చేర్చడం వల్ల జర్నలిస్టుల ప్రత్యేక గుర్తింపు, రక్షణ పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డుల వ్యవస్థ దెబ్బతింటే యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై జర్నలిస్టులు ఆధారపడాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత లేకుండా మీడియా స్వేచ్ఛ నిలబడబోదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేకపోతే, వారు స్వేచ్ఛగా వార్తలు రాయలేరని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- అది పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది
- ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు
- మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదు
- రేవంత్ చెప్పుచేతల్లో 'సిట్'
- కూర్చోమంటే కూర్చుకుంటది... స్టాండ్ అంటే నిలుస్తది
- పాలన గాలికొదిలేసి డ్రామాలాడుతున్నడు

09

## ప్రజా భవన్‌లో భోజనానికి రండి

- నేను రెండుసార్లు వచ్చాను, మీరు నాకు భోజనం పెట్టారు నాతో పాదయాత్రలో నడిచారు
- గంగుబాయితో ఆవిడ గ్రామంలో ముఖాముఖి నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02



## మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ లో పాయికారి ఒప్పందం
### మతం పేరుతో కుట్రలు చేయాలనుకుంటున్నారు

- అభివృద్ధితో కరీంనగర్ రూపురేఖలు మార్చాలనే తపన మాది
- మేయర్ పీఠాన్ని అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం
- గెలిచే చోట బీజేపీ కార్యకర్తలకే టిక్కెట్లు ఇస్తాం
- సర్వేల ఆధారంగానే అభ్యర్థులకు టిక్కెట్లు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- సంజయ్ సమక్షంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు చెందిన పలువురు నేతల చేరిక

06






## అర్హులకు సంక్షేమ ఫలాలు

- ఆ విషయంలో అధికారులందరూ ముందుండాలి
- హైదరాబాద్ జిల్లా సమీక్షలో ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్

05

## ఇప్పుడు మీ వంతు
### ఫోన్ ట్యాపింగ్ లో కేటీఆర్ కు నోటీసులు

నేడే విచారణకు రావాలని ఆదేశం

తాజాగా సిట్ ముందు హాజరైన హరీష్ రావు

SIT
SPECIAL INVESTIGATION TEAM

05

## వనదేవతను చేరేందుకు
### భక్తులకు హెలీకాప్టర్ సేవలు




- రూ. 165 కోట్లతో రహదారుల నిర్మాణం
- 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం
- సమ్మక్క–సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు

02



ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు సమయం ఆసన్నమైంది. కోట్లాది మంది భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, పార్కింగ్, భద్రత, రవాణా నుంచి వాయు మార్గ సేవల వరకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. రూ.165 కోట్ల వ్యయంతో రహదారుల అభివృద్ధి, 1418 ఎకరాల్లో విస్తరించిన భారీ పార్కింగ్ సదుపాయాలు, హెలికాప్టర్ జాయ్ రైడ్ లతో ఈ ఏడాది మేడారం జాతర మరింత భవ్యంగా జరగనుంది.

## నైనీ కోల్ బ్లాక్ టెండర్ల కథేంటి?
### కేంద్రం స్పెషల్ ఫోకస్.. విచారణకు హైలెవల్ టీమ్

10

- నిబంధనలపై గురి.. ఆ 'సైట్ విజిట్' మెలిక ఏంటి?
- సర్కార్ అప్రమత్తం.. టెండర్ల రద్దుకు ఆదేశం
- రాజకీయ రణక్షేత్రంగా సింగరేణి.. విమర్శల వర్షం
- నిలిచిన బిడ్డింగ్ ప్రక్రియ.. నెక్స్ట్ ఏంటి?



## ఇదీ ఏఐ ముద్ర

ట్రంప్ ఒక్కడు చాలు.. ప్రపంచాన్ని అంటించడానికి..





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**ఉదయన్నే నీరు తాగడం**

ఉదయం లేవగానే గోరువెచ్చని నీరు తాగాలి.
ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
శరీరంలో విషపదార్థాలను బయటకు పంపుతుంది.
మలబద్ధకం సమస్య తగ్గుతుంది.
రోజంతా శక్తివంతంగా ఉండేందుకు సహాయపడుతుంది.



# వాయు మార్గాన జాతరకు

- **మేడారంలో భక్తులకు హెలికాప్టర్ సేవలు**
- **జాతరకు రూ. 165 కోట్లతో రహదారుల నిర్మాణం**
- **1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం**
- **మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లురూ.165 కోట్లతో రహదారుల అభివృద్ధి, 1418 ఎకరాల్లో భారీ పార్కింగ్ సదుపాయాలు ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభానికి కేవలం కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో మేడారం పరిసర ప్రాంతాలు ఇప్పటికే భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాజాతర జనవరి 28 నుంచి 31 వరకు జరగనుండగా, ఈ నాలుగు రోజుల వ్యవధిలోనే దాదాపు కోటిన్నర మందికి పైగా భక్తులు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**రూ.165 కోట్లతో రహదారుల నిర్మాణం, పటిష్టత**

భారీ భక్తుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మేడారానికి దారితీసే రహదారుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. జాతీయ రహదారులు, రోడ్లు-భవనాల శాఖ, పంచాయితీరాజ్ శాఖల పరిధిలో ఉన్న మొత్తం 39 ప్రధాన రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. అదనంగా 10 కొత్త రోడ్లు, 3 కల్వర్టులు నిర్మించారు. జాతీయ రహదారుల పరిధిలోని 8 రహదారులకు రూ.360 లక్షలతో పటిష్టత, మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. ముఖ్యంగా కటాక్షపూర్, మల్లంపల్లి వద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తయ్యింది. రోడ్లు-భవనాల శాఖ ద్వారా రూ.102 కోట్ల వ్యయంతో పస్రా-భూపాలపల్లి (33 కి.మీ.), తాడ్వాయి-నార్లాపూర్ (20 కి.మీ.), చిన్నబోయినపల్లి-ఊరట్టం (23 కి.మీ.) మార్గాల్లో రీకార్పెటింగ్, పటిష్టత పనులు రికార్డు సమయంలో పూర్తయ్యాయి. సమ్మక్క గద్దెలు, దేవాలయ ప్రాంతం, పోలీస్ క్యాంపుల వద్ద బారికేడింగ్, హెలీపాడ్ నిర్మాణం, మరమ్మతులు కూడా చేపట్టారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.52.21 కోట్లతో 84 పనులు పూర్తి చేయగా, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.8.08 కోట్ల వ్యయంతో 3 కొత్త భవనాల నిర్మాణం, 29 భవనాల మరమ్మతులు, 5 కొత్త రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయి.

**1418 ఎకరాల్లో భారీ పార్కింగ్ ఏర్పాట్లు**

మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులతో పాటు లక్షల సంఖ్యలో ప్రైవేటు వాహనాలు రానున్న నేపథ్యంలో, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 43 ప్రాంతాల్లో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలు కల్పించారు.

**అటవీ శాఖ పరిధిలోని 15 ప్రాంతాల్లో 235 ఎకరాలు**

ట్రైబల్ వెల్ఫేర్, పట్టా భూములలోని 24 ప్రాంతాల్లో 1164 ఎకరాలు ప్రభుత్వ భూముల్లోని 3 ప్రాంతాల్లో 19 ఎకరాలు

ఈ పార్కింగ్ ప్రాంతాల్లో భక్తులు, డ్రైవర్లకు తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

**వాయు మార్గంలో మేడారానికి –హెలికాప్టర్ జాయ్ రైడ్**

మేడారం జాతరకు వెళ్లే భక్తులకు మరో ఆకర్షణగా హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జనవరి 23 నుంచి తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఏవియేషన్ సంస్థల సహకారంతో హెలికాప్టర్ జాయ్ రైడ్లు ప్రారంభమయ్యాయి. తాడ్వాయి మండలం ఎలుబాక నుంచి మేడారం ప్రాంతంపై 7 నుంచి 10 నిమిషాల పాటు ఏరియల్ వ్యూ చూసే అవకాశం కల్పిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి రూ.4,800 నుంచి రూ.5,000 వరకు ఛార్జీలు నిర్ణయించారు.ఒక్కో హెలికాప్టర్లో 5 నుంచి 6 మంది ప్రయాణికులు ప్రయాణించవచ్చు. శిక్షణ పొందిన పైలట్లు, అన్ని భద్రతా ప్రమాణాలతో ఈ సేవలు నిర్వహిస్తున్నారు. జాతర సందడి, అటవీ ప్రాంతం, దేవతల గద్దెలను ఆకాశం నుంచి వీక్షించే ఈ విహంగ వీక్షణం భక్తులకు మరపురాని అనుభూతిని అందించనుంది.

**భక్తుల కోసం సమగ్ర ఏర్పాట్లు**

రోడ్లు, పార్కింగ్, హెలికాప్టర్ సేవలతో పాటు భద్రత, తాగునీరు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. కోట్లాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవార్లను దర్శించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర మరోసారి ఆధ్యాత్మిక వైభవంతో, జనసంద్రంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది.

# బొగ్గు శాఖ మీ పరిదిలోనే ఉంది

- **సింగరేణి టెండర్లపై విజిలెన్స్ విచారణ జరపండి**
- **సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్**



**ముద్ర హైదరాబాద్ :**

2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో బొగ్గు టెండర్లు... తీసుకున్న అనాలోచిత నిర్ణయాలపై విచారణ జరిపి.. జరిగిన అవినీతిని బయటపెట్టాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కేంద్ర కేబినెట్ లో కీలకంగా ఉన్నారన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ కూడా ఆయన పరిధిలోకే వస్తుందని చెప్పారు. వెంటనే విజిలెన్స్ తో విచారణ జరిపించి... సింగరేణిలో జరిగిన అవినీతిని బయటపెట్టాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. శాఖలో ఏ అవినీతి జరిగింది..? ఏ కుంభకోణాలు జరిగాయో మీ వద్ద ఉండే అధికారులతో విచారణ జరిపి రిపోర్టును సీబీఐకి అప్పగించాలన్నారు. ఉదయం లేస్తే పనికిరాని ఆరోపణలతో ప్రజల దృష్టిమరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ముందు తెలంగాణకు రావాల్సిన బకాయిలను, నిధులను తీసుకురావాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఆర్మీ తర్వాత అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసేది సింగరేణి కార్మికులేనని వాళ్లు కట్టే ఆస్తిపన్నును మాఫీ చేయించాలని కోరారు.

# సరైన సమయంలో బీసీ సీఎం అవుతారు

- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **భవిష్యత్తులో బీసీలకు చాలా అవకాశాలు**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**ముద్ర హైదరాబాద్ :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నాయకుడు సీఎం అయ్యే సమయంలో కచ్చితంగా అవుతారని చెప్పారు. భవిష్యత్తులో బీసీలకు చాలా అవకాశాలు వస్తాయన్నారు. గురువారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. అవకాశం ఉన్న ప్రతీ చోట బీసీలకు పదవులు ఇస్తూ వెళ్తున్నామని చెప్పారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు వస్తుందని.. దీనిని ఎవరూ ఆపలేరని అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరిట రాజకీయాలు దేశానికి మంచిది కాదని, కులం, మతం అనేవి మన పిల్లలకు భవిష్యత్తును తీసుకురావని మహేశ్ గౌడ్ అన్నారు. రాముడు, అంజనేయుడి పేరు చెప్పి బీజేపీ వాళ్లు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ జై శ్రీరాం అని అనకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలన్నారు. ఆయన రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు. దేవుళ్లతో రాజకీయాలను ముడి పెట్టవద్దని అన్నారు.

# ప్రజా భవన్ లో భోజనానికి రండి

- **నేను రెండుసార్లు వచ్చాను, మీరు నాకు భోజనం పెట్టారు నాతో పాదయాత్రలో నడిచారు**
- **గంగుబాయితో ఆవిడ గ్రామంలో ముఖాముఖి నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర హైదరాబాద్ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా రెండేళ్ల క్రితం తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగస్వాములైన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు గ్రామస్తులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముచ్చటించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆయన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దేవుగూడ గూడెంకు చేరుకున్నారు. పాదయాత్రలో తనకు భోజనం పెట్టడంతో పాటు కొన్నికిలోమీటర్ల మేర పాదయత్రలో పాల్గొన్న ఆ గూడెంకు చెందిన లక్ష్మీబాయి, గంగు భాయ్ ను గుర్తుపెట్టుకున్న భట్టి వారిని పలకరించారు. వారిని పక్కన కూర్చోబెట్టుకుని నాటి ఫోటోలు చూపిస్తూ ఆనాటి విషయాలను గుర్తు చేశారు. తాను కూర్చున్నది, వారు చెప్పిన సమస్యల గురించి ప్రస్తావించారు. జిల్లా అధికారులతో కలిసి ఆయన గూడెం గ్రామస్తులతో భేటీ అయ్యారు ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పీఏసీఎస్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా గంగుభాయ్ తో భట్టి ప్రత్యేకంగా మాట్లాడారు. పాదయాత్రలో తనతో పాల్గొన్న గంగుబాయి, లక్ష్మీ భాయ్ భోజనం పెట్టారన్నారు. తన చేతిలో చేయి వేసి కొన్ని కిలోమీటర్లు నడిచారన్నారు. ప్రభుత్వం వస్తుందని ఆశీర్వదించి పంపారని చెప్పారు. వారు ఆశీర్వదించినట్టుగా ప్రజా ప్రభుత్వం వచ్చిందనీ వారిద్దరినీ హైదరాబాద్ లో తాను ఉంటున్న ప్రజాభవన్ కు భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని తెలిపారు. వారు హైదరాబాద్ కు వచ్చేందుకు, తిరిగి వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని భట్టి విక్రమార్క తెలిపారు.

# నేను చూసిన మనిషి, ఊరును మరచిపోలేదు

- **బడ్జెట్ పెట్టేటప్పుడు ప్రతి అంశం ఉండేలా చూస్తున్న**
- **పాదయాత్ర సమయంలో పర్యవేక్షించాను..**
- **ఆసిఫాబాద్ జిల్లా మోడీ జురి గ్రామ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**ముద్ర, ఆదిలాబాద్ :**

బడ్జెట్ పెట్టే సమయంలో తాను పాదయాత్రలో చూసిన, విన్న ప్రజల కష్టాలు తీరేలా ప్రతి అంశాన్ని చూసి పెడుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆసిఫాబాద్ జిల్లా మోడీ జూరి గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆనాడు పాదయాత్ర సందర్భంగా మోడీ జురి గ్రామానికి చేరుకున్నాను. ఆరోజు ఉగాది పండుగ మూడు రోజులపాటు ఇక్కడే ఉన్నాను. ఏరువాక సందర్భంగా వెంకట్రావు పొలంలో అరకదున్నాను. ఎద్దులకు బెల్లం కొబ్బరి తినిపించాను. ఆ తర్వాత లక్ష్మణరావు పటేల్ ఇంట్లో అందరం కలిసి గుగ్గిల్లి తిన్నాం ఆ తర్వాత భోజనం చేశామని గుర్తు చేసుకున్నారు. తాను పాదయాత్ర చేసిన గ్రామాలు, మనుషులు, సమస్యలు ఏ ఒక్కటి మర్చిపోలేదని తెలిపారు. అందులో భాగంగానే మహిళలు ప్రయాణానికి ఇబ్బందులు పడొద్దని ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని తీసుకువచ్చాం, ప్రతి వారంలో రెండు రోజులు విద్యుత్ అధికారులు పొలం బాట ప్రజా బాట పేరిట విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. నేను ఆనాడు చూసిన పిల్లలు వారే కదా మన భవిష్యత్తు అనుకున్న అందుకే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేందుకు ప్రపంచ స్థాయి లో మన పిల్లలు పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా ఐటీడీఏ లను బలోపేతం చేసేందుకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద 17 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మహిళలు బట్టలు కొనుగోలుకు పడే ఇబ్బందులను గుర్తించి నాణ్యమైన చీరలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. దొడ్డు బియ్యం పురుగులతో ఉన్నాయని ఆనాడు సమస్య వివరించగా ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఇవన్నీ కూడా ఆనాడు ప్రజలు చెప్పిన సమస్యలకు సమాధానాలు అని గుర్తు చేశారు.




# ఇప్పుడు కాదు.. వచ్చేనెల 5న తీర్పు

- **గ్రూప్ -1పై కొనసాగుతున్న ఆయోమయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గ్రూప్1 మెయిన్స్ పరీక్షలపై నేడు తుది తీర్పు వెలువడుతుందని ఆశించిన వేలాది మంది అభ్యర్థుల ఆశలు నెరవేరలేదు. హైకోర్టు నుంచి ఊహించని ట్విస్ట్ ఎదురవడంతో తీర్పు మరోసారి వాయిదా పడింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్ పరీక్ష ఫలితాలపై గత కొంతకాలంగా న్యాయపరమైన వివాదం కొనసాగుతోంది. మూల్యాంకనంలో లోపాలు జరిగాయని, మార్కుల కేటాయింపులో పారదర్శకత లేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పులో గ్రూప్1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేసి, తిరిగి మూల్యాంకనం (రీవాల్యుయేషన్) చేయాలని ఆదేశించింది. ఈ తీర్పు వెలువడిన వెంటనే అభ్యర్థుల్లో ఆశలు చిగురించగా, ప్రభుత్వం మరియు టీజీపీఎస్సీ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన రీవాల్యుయేషన్ ఆదేశాలపై స్టే విధించింది. అయితే నియామకాలు తుది తీర్పుకు లోబడే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ స్టే నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్1 నియామక ప్రక్రియను కొనసాగించింది. ఇప్పటికే ఈ పరీక్ష ద్వారా ఎంపికైన 562 మందికి నియామక పత్రాలు కూడా అందజేసింది. అయితే ఈ నియామకాలు కోర్టు తుది తీర్పుపై ఆధారపడి ఉండటంతో, ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల్లోనూ, కేసు వేసిన అభ్యర్థుల్లోనూ అనిశ్చితి కొనసాగుతోంది. ఈ కేసుపై నేడు తుది తీర్పు వెలువడుతుందని భావించిన అభ్యర్థులు ఉదయం నుంచే హైకోర్టు నిర్ణయంపై ఉత్కంఠగా ఎదురు చూశారు. గురువారం ఈ కేసును విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని లాయర్లకు తెలియజేసి, తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.కానీ అనూహ్యంగా తీర్పు కాపీ సిద్ధం కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించడంతో విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. దీంతో నేడు తీర్పు వస్తుందన్న అంచనాలు పూర్తిగా తారుమారయ్యాయి. గ్రూప్1 మెయిన్స్ ఎగ్జామ్ భవితవ్యాన్ని నిర్ణయించే కీలక తీర్పు కోసం అభ్యర్థులు మరోసారి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిబ్రవరి 5న వెలువడే తీర్పుతో గ్రూప్1 మెయిన్స్ ఫలితాలపై స్పష్టత రావడంతో పాటు, ఇప్పటికే ఇచ్చిన నియామకాలు కొనసాగుతాయా? లేదా తిరిగి మూల్యాంకనం జరుగుతుందా? అన్న టెన్షన్ కొనసాగుతోంది.

# జనాభా లెక్కల కోసం ఆదేశాలు జారీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ ప్రభుత్వం 2027 ఏప్రిల్ ఒకటి నుండి భారత జనాభా లెక్కలను ప్రారంభించనుంది. జనాభా గణన నిర్వహణ కోసం భారత గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తన ఉత్తర్వులో, 2027 భారత జనాభా లెక్కల గృహ గణన కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 మధ్య జరుగుతాయని పేర్కొన్నారు. ముప్పై రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి నిర్వహించే గృహ గణన కార్యకలాపాలు ప్రారంభం కావడానికి సరిగ్గా పదిహేను రోజుల ముందు స్వీయ గణన కోసం కూడా ఒక అవకాశం ఉంటుందని తెలిపారు.



**సమయానికి భోజనం**

ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం చేయాలి.
అతిగా తినడం నివారించాలి.
నెమ్మదిగా నమిలి తినడం మంచిది.
జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

# మహారాష్ట్ర టు యాదాద్రి

- **375 కిలోమీటర్లు.. ఇదీ పులి ప్రయాణం**
- **19 జిల్లాల మీదుగా జర్నీ**
- **అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బయలుదేరిన ఒక మగ పులి.. తెలంగాణ అడవుల గుండా సుమారు 375 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం చేస్తూ ప్రస్తుతం యాదాద్రి జిల్లాకు చేరుకుంది. తిప్పేశ్వర్ వన్యప్రాణి అభయారణ్యం నుంచి ప్రారంభమైన ఈ పులి ప్రయాణం.. గత రెండు నెలలుగా రాష్ట్రంలోని సుమారు 19 జిల్లాల మీదుగా సాగుతూ ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో అడుగు పెట్టింది. రాజధాని హైదరాబాద్‌కు కేవలం 60 కిలోమీటర్లు, ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరి గుట్టకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దత్తాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గడిచిన 50 ఏళ్ల కాలంలో ఈ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

**సరిహద్దులు దాటి..?**

వన్యప్రాణి నిపుణుల విశ్లేషణ ప్రకారం.. మగ పులులు సాధారణంగా తమకంటూ ఒక ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి లేదా ఆడ తోడు కోసం ఇలాంటి సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాయి. అందుకోసమే మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి పెన్‌గంగా నదిని దాటి ఆదిలాబాద్‌లోని బోథ్ మండలంలోకి ప్రవేశించిన ఈ పులి.. అక్కడి నుంచి నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల గుండా ప్రయాణించింది. ఒకానొక దశలో పులి తిరిగి మహారాష్ట్రకు వెళ్ళిపోయిందని అధికారులు భావించినప్పటికీ.. అది అనూహ్యంగా రూట్ మార్చుకుని దట్టమైన పొదలు, వాగుల గుండా యాదాద్రి జిల్లాకు చేరుకుంది. సాధారణంగా ఇలాంటి ప్రయాణాల్లో పులులు పగటిపూట విశ్రాంతి తీసుకుంటూ.. రాత్రి వేళల్లోనే సగటున 18 నుంచి 20 కిలోమీటర్లు నడుస్తుంటాయి. పులి సంచారంపై సమాచారం అందిన వెంటనే పీసీసీఎఫ్ నుంచి క్షేత్రస్థాయి సెక్షన్ ఆఫీసర్ల వరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దత్తాయిపల్లి, గంధమల్ల, కోనాపూర్, ఇబ్రహీంపూర్ వంటి సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు సమూహాలుగా వెళ్లాలని.. పశువులను అడవికి సమీపంలో కట్టేయకూడదని సూచించారు. ఈ పులి తన ప్రయాణ మార్గంలో ఇప్పటికే సుమారు 5 నుంచి 10 పశువులను వేటాడి ఉండవచ్చని పాదముద్రలు, మల విసర్జితాల ఆధారంగా అంచనా వేస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అధికారులు ఎన్ని కెమెరా ట్రాప్‌లు, బోనులు ఏర్పాటు చేసినా ఈ పులి ఇప్పటివరకు వాటికి చిక్కకుండా తన ఉనికిని చాటుతోంది. తెలంగాణలో ఇటీవల కాలంలో పులుల సంఖ్య, సంచారం గణనీయంగా పెరగడం సానుకూల పరిణామంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సుమారు 37 పులులు ఉండగా.. కవ్వాల్ రిజర్వ్‌లో 6 నుంచి 8 వరకు ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఒక పులి 8 నెలలుగా, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో మరో పులి 6 నెలలుగా స్థిర నివాసం ఏర్పరుచుకోవడం రాష్ట్ర అటవీ సంపదకు నిదర్శనం. పులుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ శాఖ ప్రతి డివిజన్‌కు 10 నుంచి 15 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచింది.



# బాలాపూర్ లో రోహింగ్యాలు?

- **చట్టబద్ధతపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**
- **'ధర్మ రక్షా' సభకు గ్రీన్ సిగ్నల్**
- **శాంతి భద్రతల దృష్ట్యా షరతులతో కూడిన అనుమతి**

**ముద్ర. తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ బాలాపూర్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'ధర్మ రక్షా సభకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నెల 24న జరగనున్న ఈ సభకు అనుమతి నిరాకరిస్తూ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు తప్పుబట్టింది. శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయన్న సాకుతో పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని.. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకుంటున్నారని గణేశ్ ఉత్సవ సమితి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ తన వాదనలను వినిపిస్తూ.. బాలాపూర్ ప్రాంతంలో తిష్ట వేసిన రోహింగ్యాలు, బంగ్లాదేశీ అక్రమ చొరబాటుదారులను వెంటనే వెనక్కి పంపాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీనే దరఖాస్తు చేసుకున్నా.. పోలీసులు కావాలనే జాప్యం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ.. బాలాపూర్ మతపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతమని అక్కడ 26 క్యాంపుల్లో సుమారు 6,993 మంది రోహింగ్యాలు నివసిస్తున్నారని పేర్కొంది. వారి నివాసాల వద్దే సభ నిర్వహించడం ఉద్రిక్తతలకు దారితీస్తుందని హోంశాఖ తరపు న్యాయవాది వాదించారు.ఈ క్రమంలో ధర్మాసనం ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. అక్కడ ఉంటున్న రోహింగ్యాల చట్టబద్ధమైన హోదా ఏమిటని కోర్టు ప్రశ్నించగా.. వారికి శరణార్థి హోదా లేదని, వారు అక్రమ వలసదారులేనని ప్రభుత్వ తరపు న్యాయవాది అంగీకరించారు. అయితే కేంద్ర హోంశాఖ వారి వివరాలను నమోదు చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేసిందని వివరించారు. అక్రమ వలసదారుల అంశంపై నిరసన తెలిపే హక్కు పౌరులకు ఉంటుందని అభిప్రాయపడుతూ కోర్టు సభకు అనుమతినిచ్చింది. సభకు అనుమతినిస్తూనే, శాంతిభద్రతల దృష్ట్యా హైకోర్టు కొన్ని కఠినమైన షరతులను విధించింది. సభను మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. సభకు హాజరయ్యే వారి సంఖ్య 3 వేలకు మించకూడదని..ఇతర మతాలను కించపరిచేలా గానీ, సమాజంలో ఉద్రిక్తతలు పెంచేలా గానీ ఎలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదన్నారు. సభలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ సమితి బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో గత కొన్ని రోజులుగా బాలాపూర్ సభపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. దేశ భద్రత, అక్రమ వలసల అంశంపై జరగనున్న ఈ సభ ఇప్పుడు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇప్పుడు మీ వంతు

- **ఇప్పుడు మీ వంతు**
- **ఫోన్ ట్యాపింగ్ లో కేటీఆర్ కు నోటీసులు**
- **నేడే విచారణకు రావాలని ఆదేశం**
- **తాజాగా సిట్ ముందు హాజరైన హరీష్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నందినగర్ లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులు అందించారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఇప్పటికే సిట్ ఎదుట హాజరయ్యారు. జూబ్లిహిల్స్ ఏసీపీ ఆఫీసులో కేటీఆర్ ను ప్రశ్నించనున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, జడ్జీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు సాగుతోంది. జనవరి 20న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విచారణలో హరీష్ రావు సుమారు 78 గంటల పాటు సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు అడిగిన ప్రశ్నల్లో పసలేదని, తనను కావాలనే ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని హరీష్‌రావు విమర్శించారు. అయితే, సాంకేతిక ఆధారాలు మరియు అరెస్టయిన పోలీసు అధికారుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ ప్రక్రియను మరింత లోతుగా నిర్వహించాలని సిట్ నిర్ణయించింది.

**సజ్జనార్ నేతృత్వంలోని సిట్ సమగ్ర విచారణ**

ప్రస్తుతం ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, డీఎస్పీ ప్రణీత్ రావు వంటి వారు ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీరి విచారణలో వెలుగు చూసిన విషయాల ఆధారంగానే రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే రోజుల్లో ఈ విచారణ ఎటు దారితీస్తుందో, ఎవరికి కొత్తగా నోటీసులు అందుతాయో అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా మారింది. కేసును సజ్జనార్ నేతృత్వంలోని సిట్ తీసుకున్నప్పటి నుండి మరింత దూకుడుగా విచారణ జరుపుతున్నారు. లొట్టపీసు కేసుగా లైట్ తీసుకుంటున్న కేటీఆర్ కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసును ఒక లొట్టపీసు కేసు గా కొట్టిపారేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే పాత కేసులను మళ్లీ మళ్లీ తోడుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా నైనీ కోల్ బ్లాక్ వంటి భారీ కుంభకోణాలను బీఆర్ఎస్ ఎండగడుతున్న తరుణంలో, తమను డిఫెన్స్‌లో పడేయడానికే ప్రభుత్వం ఈ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని గంటలు విచారించినా చివరకు ఇందులో తేలేది ఏమీ ఉండదని, ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యే తప్ప ఇందులో వాస్తవం లేదని కేటీఆర్ బలంగా వాదిస్తున్నారు. పోలీసుల నోటీసులకు స్పందించి ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# నైని బొగ్గు గనుల రద్దుపై విచారణకు కమిటీ

న్యూ ఢిల్లీ : నైని బొగ్గు గనుల రద్దుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు నైని బొగ్గు గనుల రద్దుపై విచారణకు కమిటీ వేసింది. కమిటీలో కోల్ డిప్యూటీ డైరెక్టర్ చేత్న శుక్లా, కోల్ డైరెక్టర్ మర్పల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ ఇద్దరు కేంద్ర సభ్యుల బృందం ఎస్ సీసీఎల్ ను సందర్శించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరనుంది. సింగరేణి నైని కోల్ బ్లాక్ మైన్ డెవలపర్, ఆపరేటర్ నియామకానికి సంబంధించి 28.11.2025న వెలుబడిన టెండర్ ఆహ్వాన నోటీసును విశ్లేషించనుంది. అదే విధంగా తవ్వకాలకు సంబంధించిన ఎండీఓలు మరియు ఔట్ సోర్సింగ్ పనుల కోసం నోటీస్ ఇన్వైటింగ్ టెండర్ తయారీలో ఇతర బొగ్గు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయనుంది. ఈ కమిటీ మూడు రోజుల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉంది.





## ముగిసిన దావోస్ టూర్ రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

**ముద్ర, హైదరాబాద్ :**

'తెలంగాణ రైజింగ్' ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. గత నెలలో హైదరాబాద్ లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. ఈ మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం, హైదరాబాద్ లో వరల్డ్ ఎకనమిక్ ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలనే ప్రతిపాదనకు సానుకూల స్పందన లభించింది. మూడు రోజుల్లో ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో 12 ముఖాముఖి సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం మూడు రోజుల తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. దావోస్ లో కార్యక్రమాలు ముగించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జూరిచ్ బయల్దేరారు. అక్కడి నుంచి అమెరికా పర్యటనకు వెళుతున్నారు. మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దావోస్ నుంచి ఇండియాకు తిరుగు పయనమయ్యారు.

# సైలెంట్ కిల్లర్..

- **మదురోను పట్టుకునేందుకు అమెరికా సీక్రెట్ వెపన్..**
- **ట్రంప్ వివాదాస్పద నిర్ణయాలు**
- **ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశం!**



న్యూ ఢిల్లీ : అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఏడాది గడిచింది. ఏడాది పాలనలో అమెరికా ఫస్ట్ అంటూ అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో అమెరికన్లు, ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇక నోబెల్ ప్రైజ్ కోసం అయితే యుద్ధాలను ఆపినట్లు యాక్షన్ చేశారు. తానే యుద్ధాలు ఆపానని చెప్పుకున్న ట్రంప్ ఇటీవల వెనుజువెలాలోని ఆయిల్ నిల్వల కోసం అక్కడ తమ అనుకూల ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వెనుజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి తీసుకొచ్చారు. ఒక దేశంలో చొరబడి ఆ దేశ అధ్యక్షుడి ఇంటికి వెళ్లడమే కాకుండా అతని బెడ్‌రూంలోకి వెళ్లి మరీ అధ్యక్షుడు నికోలస్ మదురో ఆయన భార్యను అదుపులోకి తీసుకుని ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో న్యూయార్క్ తరలించారు. రక్షణ వ్యవస్థ రాడార్లు ఉండగా, అమెరికా సైన్యం సైలెంట్‌గా వెనుజువెలాలో చొరబడడం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**ఎలా చేసి ఉంటారు..**

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, అతని భార్యను అమెరికా సైన్యం అరెస్టు చేసిన ఘటన అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఈ దాడిలో అగ్రరాజ్యం రహస్య ధ్వని ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రత్యేక మిషన్‌కు 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్' అనే పేరు పెట్టారు.

**రహస్య ఆయుధాలతో దాడి..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయంపై తాజా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మా వద్ద ఎవరూ తెలుసుకోని శక్తివంతమైన సాంకేతికత ఉంది. దాని గురించి ఎక్కువ చర్చ చేయకపోవడం మంచిదే. అది అద్భుత దాడి' అని ఒక వార్తా సంస్థకు చెప్పారు. ఈ ఆయుధం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదని వెల్లడించారు.

**మదురో గార్డ్ షాకింగ్ వివరణ..**

ఇదిలా ఉంటే.. వెనుజువెలాపై ఆపరేషన్ సమయంలో వెనెజువెలా భద్రతా సిబ్బంది ఎదుర్కొన్న పరిస్థితి భయానకంగా ఉంది. 'మా ముక్కుల నుంచి రక్తం రాగానే, కొందరు వాంతి చేసి, మిగిలినవారు నేలపై పడిపోయారు. ఆ ధ్వని ఆయుధం ముందు నిలబడలేకపోయాం'అని మదురో గార్డ్ వర్ణించాడు. 'అమెరికాను ఢీకొట్టగలమనుకుందే మోసపోతాయి' అని హెచ్చరించాడు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ వార్త ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

## పిల్లి వైసిపి పార్టీకి గుడ్ బై చెబుతారా?



వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పార్టీ మారే ఆలోచనతో ఉన్నారా? టిడిపిలో చేరుతారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారా? అందుకే సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తున్నారా? త్వరలో ఆయన ఎందుకు చంద్రబాబును కలవనున్నారు? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. నిన్నటికి నిన్న ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో వైసిపి హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. గృహ నిర్మాణంలో భాగంగా కోట్లాది రూపాయలు అప్పట్లో పక్కదారి పట్టించారని ఆరోపణలు చేశారు. మరో నాలుగు నెలలు రాజ్యసభ పదవీకాలం ముగియడం, సొంత పార్టీ నేతలపై బోస్ ఆరోపణలు చేయడంతో ఆయన పార్టీ మారుతారని ప్రచారం మొదలైంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు తర్వాత జగన్ వెంట అడుగులు వేశారు సుభాష్ చంద్రబోస్.

2014 ఎన్నికల్లో ఓటమి చవి చూశారు. 2019 ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ విషయంలో ప్రయోగం చేశారు జగన్. ఆయన సొంత నియోజకవర్గాన్ని కాదని మండపేట టిక్కెట్ ఇచ్చారు. రామచంద్రపురం నుంచి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రంగంలోకి దించారు. అయితే రామచంద్రపురం నుంచి వేణుగోపాలకృష్ణ గెలిచారు. మండపేట నుంచి సుభాష్ చంద్రబోస్ ఓడిపోయారు. అయితే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు జగన్ బోస్ కు. అలా ఎమ్మెల్సీగా ఉన్న బోస్ ను మంత్రిని కూడా చేశారు. అయితే ఇంతలో మండలిని రద్దు చేయాలని ఆలోచన చేశారు. ఈ క్రమంలోనే బోస్ను రాజ్యసభకు పంపించారు. ఆయన రాజీనామా చేసిన మంత్రి పదవిని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు ఇచ్చారు. అయితే ఎంపీగా ఉన్న బోస్ కు, మంత్రిగా ఉన్న వేణుగోపాలకృష్ణ మధ్య విభేదాలు నడిచాయి.రాజ్యసభ సభ్యుడిగా ఉండడంతో సుభాష్ చంద్రబోస్ కు మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం చిక్కలేదు.

రామచంద్రపురం నియోజకవర్గ బాధ్యతల విషయంలో ఆయన అసంతృప్తితో ఉన్నారు. మరో ఆరు నెలల్లో రాజ్యసభ పదవి కూడా ఖాళీ కానుంది. ఇప్పుడు ఏదో ఒక పొలిటికల్ ప్లాట్ ఫారమ్ కావాలి. అందుకే పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇప్పుడు మాట్లాడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గృహ నిర్మాణ అవినీతి ఆయనకు గుర్తుకు రాలేదు. ఇప్పుడు అదే అంశాన్ని పట్టుకొని సొంత పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబును కలుస్తానని చెబుతున్నారు. తద్వారా టిడిపిలో ఎంట్రీ కి సిద్ధమని సంకేతాలు పంపిస్తున్నారు. మరి తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో చూడాలి. అటు వైసిపి నాయకత్వం సైతం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

- కే రవి

# కార్మికుల హక్కులకు ముప్పు

## లేబర్ కోడ్ లపై మండిపడిన అమర్జీత్ కౌర్

**ముద్ర న్యూస్ బ్యూరో హైదరాబాద్, జనవరి 22:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్‌లు కార్మికుల హక్కులు, పత్రికా స్వేచ్ఛతో పాటు దేశ రాజ్యాంగంలోని సమాఖ్య నిర్మాణానికి తీవ్ర ముప్పుగా పరిణమించాయని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) ప్రధాన కార్యదర్శి శ్రీమతి అమర్జీత్ కౌర్ అన్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ (ఎన్ఆర్ఆర్ఆర్సి) ఆధ్వర్యంలో హైదరాబాద్ కొండాపూర్ సి.ఆర్. ఫౌండేషన్ లోని ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో నిర్వహించిన "భారతదేశంలోని కొత్త కార్మిక చట్టాలు, వాటి ప్రభావాలు" అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. కొత్త కార్మిక కోడ్‌లు కార్మిక వ్యతిరేకమైనవిగా ఉన్నాయని, కార్మిక సంక్షేమం కన్నా కార్పొరేట్ ప్రయోజనాలకే అనుకూలంగా వాటిని రూపొందించారని ఆమె విమర్శించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, యజమానుల ఇష్టానుసారంగా పని గంటలు పెంచుకునే వెసులుబాటు కల్పించడం కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమేనని అమర్ కౌర్ విమర్శించారు. 'వేతనం' అనే పదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ద్వారా అలవెన్సులు తగ్గిపోతాయని, దీని ప్రభావం పిఎఫ్, గ్రాట్యుటీ, రిటైర్ ప్రయోజనాలపై తీవ్రంగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక నిబంధనతో కార్మిక యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన చట్టాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం కుదించారన్నారు. ఇఎస్ పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధిని తగ్గించడంతో కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు.

సదస్సులో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, ఐఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు పి. ప్రసాద్, ఎఐటియుసి సీనియర్ నాయకులు బి.వి.విజయలక్ష్మి , సి.ఆర్.ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎఐటియుసి అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్, ఎఐబిఈఎ జాతీయ కార్యదర్శి రాంబాబు, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు పాల్గొనగా నీలం రాజశేఖర్ రెడ్డి రిసెర్చ్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. లేబర్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.

సదస్సు అమర్ కౌర్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించిన ప్రధాన కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటిని కేవలం నాలుగు కోడ్ మార్చడం సంస్కరణ కాదని, ఇది కార్మిక హక్కులపై ప్రత్యక్ష దాడి అని దుయ్యబట్టారు.ఈఎస్ పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధి తగ్గిపోవడంతో కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని అమర్ కౌర్ హెచ్చరించారు. గిగ్ వర్కర్లు, ప్లాట్ వర్కర్లకు భద్రత ఉంటుందన్న ప్రభుత్వ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, చట్టబద్ధమైన హక్కులు మాత్రం




లేవని విమర్శించారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ కోసం సమ్మె చేసే హక్కును కూడా కొత్త కోడ్ కాలరాస్తున్నాయని, అనేక నిబంధనలు పెట్టి యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్య హక్కులు – కార్మిక హక్కులు' ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కాపాడుకునేందుకు కార్మిక వర్గం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక కార్మికులతో పాటు ఐటి, మీడియా, అసంఘటిత రంగాల వారు కూడా ఈ చట్టాల వల్ల నష్టపోతారని, అందుకే అందరూ ఏకమై దేశవ్యాప్త పోరాటాలు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కోడ్ అమలు చేయకుండా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

## మీడియా స్వేచ్ఛకు ముప్పు: శ్రీనివాస్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు రక్షణగా ఉన్న 'వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్'ను రద్దు చేసి, దానిని ఇతర కార్మిక చట్టాలతో కలిపి 'ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ చేర్చడం వల్ల జర్నలిస్టుల ప్రత్యేక గుర్తింపు, రక్షణ పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డుల వ్యవస్థ దెబ్బతింటే యాజమాన్యాల దయా దాక్షిణ్యాలపై జర్నలిస్టులు ఆధారపడాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత లేకుండా మీడియా స్వేచ్ఛ నిలబడబోదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేకపోతే, వారు స్వేచ్ఛగా వార్తలు రాయలేరని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అని అన్నారు. 1952లో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ సిఫారసుల మేరకు స్వాతంత్ర్యం తర్వాత రెండు చట్టాలు ఆమోదించారని, అవి జర్నలిజం ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిబడిందని, 1955లో వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం, 1958లో మూడు చట్టాలు ఆమోదించి, భారత ప్రెస్ కౌన్సిల్, వార్తా పత్రికల నమోదు, జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేతన బోర్డు ఏర్పాటుకు దారితీశాయని తెలిపారు. ఈ రెండు చట్టాలు జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ స్వేచ్ఛకు కీలకమైనవని, కానీ కొత్త కార్మిక కోడ్ 29 చట్టాలతో పాటు వీటిని కూడా రద్దు చేశారని తెలిపారు. ఈ కొత్త చట్టాలు ప్రధానంగా కార్పొరేట్ సంస్థలకు, యజమానులకు అనుకూలంగా ఉన్నాయని, తద్వారా పని గంటలు పెరగడం, ఉద్యోగ భద్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ లేబర్ కోడ్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేయాలని శ్రీనివాస రెడ్డి సూచించారు.కేవలం పారిశ్రామిక కార్మికులతో పాటు జర్నలిస్టులు, మీడియా రంగంలో పనిచేసే వారు కూడా ఈ చట్టాల వల్ల ప్రభావితమవుతారని, అందరూ ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్మికులు, జర్నలిస్టులు, మేధావులు అందరూ కలిసి ఈ లేబర్ కోడ్లను వ్యతిరేకించాలన్నారు.

### యజమానులకు అపరిమిత అధికారాలు – పి. ప్రసాద్

ఐఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్ మాట్లాడుతూ 1926లో ఆమోదించిన ట్రేడ్ యూనియన్ల చట్టం కొత్త కోడ్ సమాధి చేయబడుతోందన్నారు. కొత్త కోడ్ పొందుపర్చిన 60 రోజుల ముందస్తు నోటీసు వంటి నిబంధనలు కార్మికుల నిరసన గళాన్ని అణచివేయడమేనని అన్నారు. కొత్త లేబర్ కోడ్ యజమానులకు అపరిమిత అధికారాలను కల్పిస్తూ 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని చట్టబద్ధం చేస్తున్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామన్న ప్రకటనలకు స్పష్టమైన నిధులు, అమలు విధానం లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, సమ్మె లాంటి ప్రాథమిక హక్కులపై తీవ్రమైన ఆంక్షలు విధించిందని మండిపడ్డారు. యూనియన్లు లేని కార్మిక వర్గం నిస్సహాయంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# చేరికల చిచ్చు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అదనపు బలం కోసం పార్టీలో చేర్చుకుంటే వాళ్లతోనే విభేదాలు వస్తున్నాయి. ఏదో ఒకటీ, రెండు రోజుల్లో వివాదాలు సద్దుమణుగుతాయనుకుంటే.. అవి పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఫిరాయింపు ఎమ్మెల్యేలే సమస్యగా మారారు. వారిపై అనర్హతా వేటు పడకుండా ఉండటానికి వారు తమ పార్టీ కాదని చెప్పారు. చాలా మంది అదే నిజం చేస్తున్నారు. కాంగ్రెస్ లో లేమని చెప్పుతూనే అక్కడ చిచ్చు పెడుతూనే ఉన్నారు. ఫలితంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్‌కు తలనొప్పి తగ్గడం లేదు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఇప్పుడు మింగుడు పడని మెతుకులా మారింది. బలమైన ప్రతిపక్షం లేకుండా చేయాలనే వ్యూహంతో బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న కాంగ్రెస్ పెద్దలకు, ఇప్పుడు వారే రాజకీయంగా పెద్ద తలనొప్పిగా తయారయ్యారు. వారిపై అనర్హతా వేటు పడకుండా.. వారు తమ పార్టీ కాదని చెబుతున్నారు. ఆ పది మందిలో చాలా మంది అదే నిజం చేస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఈ ఎమ్మెల్యేల ద్వంద్వ వైఖరి పార్టీ క్యాడర్‌లో గందరగోళాన్ని సృష్టిస్తోంది.

### కాంగ్రెస్‌కు దూరం దూరం

పటాన్ చెరు, గద్వాల వంటి నియోజకవర్గాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వారు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి సహకరిస్తామనే సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ హైకమాండ్‌ను విస్మయానికి గురి చేస్తోంది. ఇది కేవలం ఒక నియోజకవర్గానికో పరిమితం కాకుండా, మెజారిటీ ఫిరాయింపు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

### పార్టీలోనే ఉన్న వారితో కొత్త సమస్యలు

జగిత్యాల వంటి చోట్ల ఎమ్మెల్యేలు సాంకేతికంగా కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ, పాత కాంగ్రెస్ కార్యకర్తలకు, ఈ కొత్త నేతలకు మధ్య సమన్వయం కుదరడం లేదు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన నాయకులు, ఇప్పుడు తమ ప్రత్యర్థుల కింద పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ఈ అంతర్గత పోరు వల్ల పార్టీ సంస్థాగతంగా బలహీనపడుతోంది. ఈ పరిణామాలను గమనిస్తుంటే, ఫిరాయింపులను ప్రోత్సహించడం కాంగ్రెస్ చేసిన ఒక వ్యూహాత్మక తప్పిదంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### దానంతో తంటాలు

మరోవైపు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం పార్టీకి ఒక పరీక్షగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన భవిష్యత్ అడుగులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పుడు ఆయనతో రాజీనామా చేయించి ఉపఎన్నికకు వెళ్లడమా, లేక అనర్హత వేటు పడే వరకు వేచి చూడటమా అనే సందిగ్ధంలో ప్రభుత్వం ఉంది. ఒకవేళ ఉపఎన్నికలు వస్తే, అవి ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారుతాయనే భయం కూడా కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది.

### అదే అసలు సమస్యలే

రాజకీయంగా బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టాలనే ఆత్రుతలో, సరైన వడపోత లేకుండా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం వల్ల కాంగ్రెస్ తన సొంత అస్తిత్వాన్ని ప్రమాదంలో పడేసుకుంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉంటామని చెప్పే కాంగ్రెస్, ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో ఉన్న నైతిక బలాన్ని కొంత కోల్పోయిందని చెప్పవచ్చు. ఈ ఎమ్మెల్యేలు ఇప్పుడు అటు బీఆర్ఎస్ కార్యకర్తలను మెప్పించలేక, ఇటు కాంగ్రెస్ శ్రేణులతో కలవలేక సతమతమవుతున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న చోట కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేస్తుందని భావించిన అధిష్టానానికి, ఇప్పుడు ఉన్న స్థానాలను కాపాడుకోవడం కూడా సవాల్‌గా మారింది. ప్రజలు కూడా ఫిరాయింపుల రాజకీయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్ ఈ ఫిరాయింపు కష్టాల నుంచి ఎలా గట్టెక్కుతుందో చూడాలి.

### భాస్కర్ రావుకు వరించిన

# అత్యున్నత హోదా

**యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు ఐఏఎస్ హోదా**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు కు ఐఏఎస్ హోదా వరించింది. ఈ మేరకు కేంద్ర మానవ వనరులు, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్ల శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ యాదవ్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాధవరం గ్రామానికి చెందిన సామాన్య దర్జీ కుటుంబంలో భాస్కర్ రావు జన్మించారు. తండ్రి వీరభద్రయ్య చిన్నతనంలోనే మృతి చెందగా, తల్లి రాంబాయమ్మతో పాటు సోదరులు నాగేశ్వరరావు, సీతారామారావుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించారు. ఆయనకు భార్య శ్రీదేవి, ఇద్దరు కుమారులు (కవలలు) ఉన్నారు.



1995లో గ్రూప్–2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన భాస్కర్ రావు, ఖమ్మం జిల్లా వైరాలో డిప్యూటీ తహసీల్దార్‌గా రెవెన్యూ శాఖలో సేవలను ప్రారంభించారు. 1998లో ఖమ్మంలోనే తహసీల్దార్‌గా నియమితులయ్యారు. 2010లో డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీగా పనిచేశారు. 2013లో భువనగిరి ఆర్డీఓగా ఏడాది పాటు విధులు నిర్వహించి, 2014లో సచివాలయంలో ఐటీ సెల్ జేడీగా సేవలందించారు.

2016లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన, నిర్మల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా విధుల్లో చేరారు. జనగామ, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో రెవెన్యూ–అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2024 మార్చి 13 నుంచి యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించి, ఆలయ గోపురానికి స్వర్ణ తాపడం పనులను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు గుట్టలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు ఐఏఎస్ హోదా లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సోదరులు అందించిన ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్ట స్వామివారి స్వర్ణ తాపడం పనులు పూర్తి చేయడం తన పూర్వజన్మ సుకృతమని భావిస్తున్నానన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాతో తనకు విడదీయలేని అనుబంధం ఏర్పడిందని పేర్కొన్నారు.

### భాస్కర్ రావుకు సన్మానం

కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్ హోదా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, గురువారం భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, మండల తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు భాస్కర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



### కరీంనగర్‌లో శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం

ముద్ర, కరీంనగర్ : ఉత్తరాయణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో శ్రీ వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించచారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ డా. గర్రెపల్లి మహేశ్వర శర్మ గారు ప్రవచించారు. జనవరి 17, 2026 శనివారము నుంచి జనవరి 23, 2026 శుక్రవారము వరకు ప్రతిరోజూ ప్రవచనాలు జరుగుతాయి. టీటీడీ కళ్యాణ మండపము (వైశ్యభవన్ ఎదురుగా), గాంధీ రోడ్, కరీంనగర్ లో ఈ ప్రవచనాలు కొనసాగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామచంద్ర స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- ఆ విషయంలో అధికారులందరూ ముందుండాలి
- హైదరాబాద్ జిల్లా సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

ముద్ర, హైదరాబాద్ :




హైదరాబాద్ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పథకాల అమలు, పురోగతిపై ఆయన విస్తృతంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక విధానాలతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జనాభా వృద్ధి, ఉపాధి కోసం వలసలు, సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని విద్య, ఆరోగ్యం, గృహాలు, రవాణా, భద్రత, ప్రజాసేవల అమలును సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం, 2బిహెచ్‌కే గృహాలు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, విద్యా రంగం, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి వంటి పథకాల అమలుపై మంత్రి సమీక్షించారు.

**పథకాల అమలు తీరు పరిశీలన..**

ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ కవరేజ్, లబ్ధిదారుల పరిధి, ఆసుపత్రుల నెట్‌వర్క్, బస్తీ దవాఖానాలు, ప్రజారోగ్య సౌకర్యాలపై వైద్యాధికారులు వివరాలు సమర్పించారు. రవాణా, పట్టణ విస్తరణ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ చర్యలు, ఆర్టీసీ ప్రజా రవాణా బలోపేతం, కొత్త బస్ మార్గాల ప్రారంభం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు వంటి అంశాలను మంత్రి పరిశీలించారు. ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, ప్రజా ప్రదేశాల్లో ఈవీ చార్జింగ్ మౌలిక వసతుల ఏర్పాటు తీరును సమీక్షించారు. ఉపాధి, ఆర్థిక రంగాల్లో చేనేత, వస్త్ర పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్లమ్ స్థాయి సమాఖ్యలపై కూడా చర్చ జరిగింది.

**విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం..**

రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. క్రీడాకారులకు ప్రత్యేక తర్ఫీదు అందించడం జరుగుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, గాలి నాణ్యత, భూగర్భ జల మట్టాలు, ఉద్యానవనాలు, పశుపోషణ, మత్స్య, పాడి అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. ఉచిత విద్యుత్ 200 యూనిట్ల సరఫరా, ప్రభుత్వ భూముల సంరక్షణ, మీ-సేవా కేంద్రాల ద్వారా సేవల అందుబాటు, అగ్నిమాపక సేవలు, బాల కార్మికులు, భిక్షాటన నిర్మూలన, న్యాయ కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ జితేందర్ రెడ్డి, డిఆర్వో వెంకటాచారి, సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా సంక్షేమ అధికారులు జి ఆశన్న, అక్కేశ్వరరావు, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, కోటాజి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలు నిర్వీర్యం
## మాజీ మంత్రి హరీశ్ రావు

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో బీఆర్ఎస్ వైపు ప్రజలు, నాయకుల మొగ్గు

ముద్ర, హైదరాబాద్ :



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పట్టణాభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలు, అమలు కాని హామీలతో విసిగిపోయిన ప్రజలు, నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన పలువురు కీలక నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరుతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతి పథకం ద్వారా ప్రతినెలా నిధులు విడుదల చేసి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు విడుదల చేయడం లేదని ఆరోపించారు. దీంతో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి, చెత్త ఎత్తడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందన్నారు. నిధుల కొరతతో పట్టణాల్లో పారిశుధ్యం లోపించిందని, దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్ట్రీట్ లైట్లు వెలిగే పరిస్థితి లేదని, తాగునీటి సరఫరాలో కూడా కోతలు విధిస్తున్నారని తెలిపారు. ఇస్నాపూర్, గుమ్మడిదల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలు, యువత, రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ నిలిచిపోయిందని, దళిత బంధు, బీసీ బంధు పథకాలను పూర్తిగా పక్కన పెట్టారని ఆరోపించారు. పెన్షన్ల పంపిణీలో కూడా తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## అథ్లెటిక్స్ క్రీడాకారులకు ఎస్పీ సహాయం

ముద్ర, వనపర్తి :

క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, పోలీసు విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపడం గర్వకారణమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌కు అథ్లెటిక్స్ (రన్నింగ్) విభాగంలో ఎంపికైన కానిస్టేబుళ్లకు గురువారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో స్పైక్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం ప్రతి క్రీడాకారుడికి లభించే అరుదైన, గౌరవప్రదమైన అవకాశం అని ఎస్పీ తెలిపారు. అంకితభావం, నిరంతర సాధన, పట్టుదలతో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించి జోగులాంబ జోన్, వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.4.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- శేరిలింగంపల్లిలో మౌలిక వసతులకు ఊపిరి
- రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధికి శ్రీకారం

ముద్ర, శేరిలింగంపల్లి :




శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.4 కోట్ల 35 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్, పార్కుల అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. లింగంపల్లి విలేజ్, రాజీవ్ గృహకల్ప, నెహ్రూ నగర్, గుల్మోహర్ సిగ్నల్ చౌరస్తా, మసీదు బండ, రోలింగ్ మెడోస్, స్ప్రింగ్ వ్యాలీ తదితర కాలనీల్లో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**ప్రజల సౌకర్యమే లక్ష్యం..**

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని తెలిపారు. రూ.4.35 కోట్లతో చేపడుతున్న ఈ మౌలిక వసతుల పనులు కాలనీ వాసులకు పెద్ద ఉపశమనమని అన్నారు. రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీపడకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

**త్వరితగతిన పనులు పూర్తి చేయాలి..**

పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు.

**మంజూరైన అభివృద్ధి పనుల వివరాలు..**

పీఏసీ చైర్మన్ వివరాల ప్రకారం... లింగంపల్లి విలేజ్‌లో ఎస్‌జీ టవర్స్ నుంచి టీం అండ్ అబోడ్ అపార్ట్‌మెంట్ వరకు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రాజీవ్ గృహకల్పలో రూ.48 లక్షల అంచనా వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతారు. నెహ్రూ నగర్ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే విజయ రాఘవ టౌన్షిప్ నుంచి గుల్మోహర్ సిగ్నల్ వరకు రూ.72 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. మసీదు బండ ప్రాంతంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు విస్తరణతో పాటు చిరాక్ పబ్లిక్ స్కూల్ నుంచి కేవస్ బేకర్స్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపడతారు. రోలింగ్ మెడోస్‌లో రూ.100 లక్షలతో పార్క్ ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టనుండగా, స్ప్రింగ్ వ్యాలీలో రూ.85 లక్షల వ్యయంతో పార్క్ ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చర్లపల్లి టూ కేరళ
## నేడు అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ట్రైన్

ముద్ర, తెలంగాణ బ్యూరో :



భాగ్యనగర వాసులకు, ముఖ్యంగా శివారు ప్రాంతాల ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు అందించింది. నగరంలో కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి ఉత్తర తిరువనంతపురానికి అత్యాధునిక 'అమృత్ భారత్' వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రారంభించనున్నారు. జనవరి 23న ప్రత్యేక సర్వీసుగా ఈ రైలు తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది.ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, నెల్లూరు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో సాగుతుంది. అనంతరం తమిళనాడులోని కాట్పాడి, సేలం, ఈరోడ్ స్టేషన్లను దాటుకుని కేరళలోని పాలక్కాడ్, ఎర్నాకుళం, కొట్టాయం, కొల్లం మార్గంగా తిరువనంతపురం చేరుకుంటుంది. సాధారణ వీక్లీ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌ను అధికారులు త్వరలో ఖరారు చేయనున్నారు. ఈ కొత్త రైలు (17041/17042) 11 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, 8 స్లీపర్ కోచ్‌లతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన రెండు కోచ్‌లతో నడవనుంది. ప్రయాణికుల సౌకర్యం కోసం ఒక ప్యాంట్రీ కార్‌ను కూడా ఏర్పాటు చేశారు. రైలుకు రెండు వైపులా ఇంజన్లు ఉండటం వల్ల వేగం పెరగడంతో పాటు కుదుపులు లేని సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

**అదనపు బోగీలు-రద్దీకి ఊరట..**

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్ - విశాఖపట్నం మార్గంలో నడిచే రైళ్లకు అదనపు ఏసీ బోగీలను జత చేశారు. సికింద్రాబాద్ - విశాఖపట్నం (22203/22204) దురంతో ఎక్స్‌ప్రెస్‌కు మూడు థర్డ్ ఏసీ బోగీలను కేటాయించారు. ఈ సదుపాయం జనవరి 24 నుంచి అమలులోకి వస్తుంది. అలాగే సికింద్రాబాద్ - అనకాపల్లి (07055/07056) రైలుకు కూడా మూడు అదనపు ఏసీ బోగీలను జత చేయగా, ఇవి జనవరి 22 నుంచే ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త రైలు సర్వీసులు, అదనపు బోగీల ఏర్పాటుతో తెలుగు రాష్ట్రాల నుంచి కేరళ, ఉత్తర ఆంధ్రకు వెళ్లే వేలాది మంది ప్రయాణికులకు రద్దీ, ట్రాఫిక్ సమస్యలు తగ్గనున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ముద్ర, వనపర్తి :



త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష చేపట్టారు. ఫోటోతో కూడిన ఎలక్టోరల్ రోల్ ప్రచురణ, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు, రిటర్నింగ్ అధికారుల ఎంపిక, పోలింగ్ సిబ్బంది నియామకం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పకడ్బందీగా నిర్వహించాలని, నామినేషన్ సమయంలో వెబ్ క్యాస్టింగ్ లేదా వీడియో కవరేజ్ చేయించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో జరగనున్న ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఫోటోతో కూడిన ఎలక్టోరల్ రోల్ విడుదల చేసి ప్రజల నుంచి వచ్చిన సుమారు 200 అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 80 వార్డులకుగాను 1,17,441 ఓటర్ల కోసం 191 పోలింగ్ కేంద్రాలను గుర్తించి మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా, పోలింగ్ సిబ్బంది వివరాలను 'టిపోల్'లో నమోదు చేశామని, సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్య, డీపీఓ రఘునాథ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో 2500ల గజాల పార్కును కాపాడిన హైడ్రా

- శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు
- కాలనీవాసులకు ఊరట

ముద్ర, హైదరాబాద్ :






హైదరాబాద్ నగర పరిధిలో పబ్లిక్ స్థలాల ఆక్రమణలపై హైడ్రా ఒక్కరోజులో రెండు చోట్ల కఠిన చర్యలు చేపట్టింది. గచ్చిబౌలి ప్రాంతంలో పార్కు స్థలాన్ని కాపాడగా, శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణలను తొలగించి స్థానికులకు దారి సౌకర్యం కల్పించింది.

**గచ్చిబౌలిలో పార్కు స్థలం రక్షణ..**

గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 1982లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 32 ఎకరాల విస్తీర్ణంలో అప్పటి హుడా అనుమతితో లేఅవుట్ వేశారు. ఇందులో 4,000 గజాలను పార్కు కోసం కేటాయించారు. కాలక్రమంలో సుమారు 1,500 గజాల వరకు ఆక్రమణలు జరగగా, నివాసాలు కూడా ఏర్పడ్డాయి. మిగిలిన 2,500 గజాల స్థలంలో కూడా ప్లాట్లు ఉన్నాయంటూ కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. టెలికాం నగర్ నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. పార్కు స్థలంగా కేటాయించిన 4,000 గజాల విషయాన్ని నిర్ధారించిన అనంతరం, ఇప్పటికే నిర్మాణాలు జరిగిన ప్రాంతాలను మినహాయించి మిగిలిన 2,500 గజాల స్థలంలో ఆక్రమణలను తొలగించారు. పార్కు స్థలమని సూచించే బోర్డులు ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా ఫెన్సింగ్ వేశారు.

**శామీర్‌పేటలో రోడ్డు ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీలో గురువారం రోడ్డు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు 1198లో 4.20 ఎకరాల విస్తీర్ణంలో 1987లో లేఅవుట్ వేయగా, ఇందులో కేటాయించిన 20 అడుగుల రహదారిని ఆక్రమించి గోడలు నిర్మించారు. గేటు ఏర్పాటు చేసి పక్క ప్లాట్లలో కలిపేశారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే మార్గం మూసుకుపోయిందంటూ ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో హైడ్రా విచారణ చేపట్టింది. రోడ్డు ఆక్రమణను నిర్ధారించిన అనంతరం గురువారం అడ్డంకులను తొలగించి కాలనీవాసులకు దారి కల్పించింది. గత 15 ఏళ్లుగా సంబంధిత శాఖలకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, హైడ్రా చర్యలతో చివరకు న్యాయం జరిగిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

మానసిక ఆరోగ్యానికి రోజూ 5–10 నిమిషాలు ధ్యానం చేయండి. ఎక్కువ స్ట్రెస్ ఉంటే మొబైల్ వినియోగం తగ్గించండి నచ్చిన పని / సంగీతం / పుస్తకం కోసం సమయం కేటాయించండి

# మజ్లిస్ తో కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

**మతం పేరుతో కుట్రలు చేయాలనుకుంటున్నారు.. మేయర్ పీఠాన్ని అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం..**
**గెలిచే చోట బీజేపీ కార్యకర్తలకే టిక్కెట్లు ఇస్తాం.. సర్వేల ఆధారంగానే అభ్యర్థులకు టిక్కెట్లు..**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**
**బీజేపీలో చేరిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు**





**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మజ్లిస్ లో ఒక వర్గం నేతలతో కాంగ్రెస్, మరో వర్గంతో బీఆర్ఎస్ నేతలు ఒప్పందం కుదుర్చుకుని మతం పేరుతో కుట్రలు చేయాలనుకుంటున్నాయని ఆరోపించారు. తాము మాత్రం అభివృద్ధి మంత్రంతోనే ప్రజల్లోకి వెళుతున్నామని స్పష్టం చేశారు. కేంద్ర నిధులతోనే కరీంనగర్ లో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, బీజేపీని గెలిపిస్తే మరిన్ని నిధులు తీసుకొచ్చి కరీంనగర్ రూపురేఖలు మారుస్తానని చెప్పారు. పొరపాటున ఇతర పార్టీలకు ఓట్లేస్తే అభివృద్ధి పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గురువారం సాయంత్రం కరీంనగర్ 46వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలతో పాటు బీఆర్ఎస్ కు సంబంధించి 10వ డివిజన్ కు చెందిన సాగాని కొమరయ్య, 30వ డివిజన్ కు చెందిన నక్క రాజేశ్వరరావు, 48వ డివిజన్ కు చెందిన కర్రి అనిల్ కుమార్, 4వ డివిజన్ కు చెందిన దుర్శేడు మురళి, 47వ డివిజన్ కు చెందిన శ్రీరాం నరేందర్ లు తమ వందలాది మంది అనుచరులతో వచ్చి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. కరీంనగర్ ఎంపీ కార్యాయలంలో కొద్దిసేపటి క్రితం జరిగిన ఈ కార్యక్రమంలో బండి సంజయ్ వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కాషాయ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలను, కరీంనగర్ ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం ఇచ్చిన నిధులతో కరీంనగర్ లో జరిగిన అభివృద్ధిని చూసి, బీజేపీ సిద్దాంతాలు నచ్చి బీజేపీలో చేరుతున్న నాయకులకు స్వాగతం తెలిపారు. కరీంనగర్ అభివృద్ధి చెందిందంటే కేంద్ర నిధులే ప్రధాన కారణమని అన్నారు. అభివృద్దే లక్ష్యంగా, అభివృద్దే మంత్రంగా బీజేపీ ఎన్నికల్లోకి వెళుతుందన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించి కరీంనగర్ మేయర్ స్థానాన్ని బీజేపీకి అప్పగిస్తే అత్యధిక నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. లేకుంటే అభివృద్ధి పనులు ఆగే ప్రమాదముందని, పనులు ఆగొద్దంటే కేంద్ర నిధులే శరణ్యమని, కరీంనగర్ ను అభివృద్ధి చేయాలనే తపన మాలో ఉందని పునరుద్ఘాటించారు. సర్వే ఆధారంగా టిక్కెట్లు ఇస్తాం. బీజేపీ కార్యకర్తలు గెలిచే అవకాశాలు ఉన్న చోట వాళ్లకే టిక్కెట్లు ఇస్తామన్నారు. అక్కడ గెలిచే అవకాశం, కార్యకర్తలు గెలిచే అవకాశం లేనిచోట సర్వే నిర్వహించి ఇతరులకు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. అందుకోసం త్రిసభ్య కమిటీ వేశామని, వాళ్లే ఎవరికి టిక్కెట్ ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.



మేం అభివృద్ధితో వస్తున్నాం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో కలిసి మతతత్వంతో ప్రజలను రెచ్చగొట్టి లబ్ది పొందాలనుకుంటున్నాయి. వాస్తవాలు గుర్తించి పార్టీలో చేరిన నేతలంతా కష్టపడి పనిచేయాలన్నారు. కరీంనగర్ రూపురేఖలను మార్చాలనే తపనతో ఉన్నాం. ప్లాన్ రడీగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ కలిసి లోపాయికారీ ఒప్పందంతో మతం పేరుతో బీజేపీని అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని వివరించారు. ఎవరు వచ్చినా బీజేపీ గెలుపు ఆపతరం కాదు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేసి తీరుతామని సంజయ్ తెలిపారు.

## నాగోబా ఆలయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు



**ముద్ర, ఇంద్రవెల్లి:** ఆదిలాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కేస్లాపూర్ నాగోబా దేవాలయాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి కొండా సురేఖకు మేస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో ఆమె నాగోబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని మంత్రి ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి, ఆదివాసీల సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన కేస్లాపూర్ నాగోబా క్షేత్రం విశిష్టత అపూర్వమని పేర్కొన్నారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు. మేస్రం వంశీయుల పెద్దలు మంత్రిని శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అడ్మిన్ ఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్, సర్పంచ్ మేస్రం తుకారాం, ఆలయ కమిటీ చైర్మన్ మేస్రం ఆనంద్ రావ్, బాధిరావ్ పటేల్, కటోడ కోసేరావ్, హనుమంత్ రావ్, దాదారావ్, మనోహర్ పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ సోయం బాపురావు ప్రత్యేక పూజలు



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని మాజీ ఎంపీ రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వారికి మెస్రం వంశీయులతోపాటు ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. నాగోబా దేవతల ఫొటోలు అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. వారి వెంట రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేద్మకి ఆనంద్ రావు తదితరులు ఉన్నారు.

## దుబ్బగూడెం శివారులో చిరుత పులి పాదముద్రల గుర్తింపు



**ముద్ర, కాసిపేట:** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామ శివారులో చిరుత పులి పాద ముద్రలను అధికారులు గుర్తించారు. గురువారం దుబ్బగూడెం శివారులోని పంట పొలాల్లో చిరుత పులి సంచరిస్తునట్లు సమాచారం మేరకు బెల్లంపల్లి డివిజన్ ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు .ఈ సందర్భంగా చిరుత పులి పాదముద్రలను గుర్తించారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో పెద్ద పులి సంచరించగా ఇప్పుడు చిరుత పులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పంట పొలాలకు, గ్రామ శివార్లకు వెళ్లే రైతులు, గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు ఎఫ్ఎస్ వో శ్రీనివాస్, యానిమల్ ట్రాకర్స్, సిబ్బంది ఉన్నారు.

## కొలనూరు జాతరకు పటిష్ట బందోబస్తు



**డీసీపీ భూక్యా రాంరెడ్డి**

**ముద్ర, ఓదెల:** పెద్దపల్లి జిల్లాలోని కొలనూరు సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి తెలిపారు. గురువారం ఓదెల మండలం కొలనూరు గుట్టలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరను పోలీస్ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తు, పార్కింగ్ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొలనూరు జాతర చుట్టూ గుట్టల మధ్యన చెరువు సమీపంలో చెట్లు ఉండి ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. జాతర చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి జాతర మేడారం తర్వాత రెండవ జాతరగా పేరు గాంచినట్టు స్థానికులు తెలిపారు.

ఈ సందర్భంగా డీసీపీ వెంట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పోత్కాపల్లి ఎస్సై దీకొండ రమేష్గౌడ్, జాతర చైర్మన్ కొలిపాక మధునయ్య, వైస్ చైర్మన్ సట్ల సదయ్యగౌడ్, సర్పంచ్ పల్లె కనకయ్య, మధ్యవేణి రవి యాదవ్, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## చెరువు తండాకు గర్వకారణం.. యువతకు ప్రేరణ

## బాణావత్ వెంకటేశ్వర్లు



సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, చెరువు తండా గ్రామానికి చెందిన బాణావత్ వెంకటేశ్వర్లు రాష్ట్ర సివిల్ సర్వీస్ లో దీర్ఘకాలం విశిష్ట సేవలందించిన అనంతరం భారత పరిపాలనా సేవ (IAS)కు పదోన్నతి పొందడం తండా ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది.

**గ్రామీణ నేపథ్యం నుంచి IAS వరకు..**
గ్రామీణ, ఆర్థికంగా పరిమిత వాతావరణంలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించిన వెంకటేశ్వర్లు కష్టపడే మనస్తత్వం, పట్టుదల, నిరంతర అధ్యయనంతోఅంచెలంచెలుగా ప్రభుత్వ సేవలో ఎదిగారు. ప్రాథమిక విద్య గ్రామంలోనే పూర్తి చేసి, విద్యతో పాటు ఉద్యోగాన్ని సమన్వయం చేస్తూ దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేయడం, గ్రూప్–IV నుంచి గ్రూప్–II, తదుపరి డిప్యూటీ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి (DRO) మరియు చివరికి IAS వరకు చేరడం యువతకు ఆదర్శంగా నిలిచే ప్రయాణం.

**యువతకు సందేశం**
బాణావత్ వెంకటేశ్వర్లు జీవన ప్రయాణం "గ్రామం అడ్డంకి కాదు – లక్ష్యం ఉంటే గమ్యం సాధ్యం" అనే మాటకు సజీవ ఉదాహరణ. పోటీ పరీక్షలకు సిద్ధమవు తున్న యువతకు, తండా, గ్రామీణ ప్రాం తాల విద్యార్థులకు ఆయన విజయం గొప్ప ప్రేరణగా నిలుస్తోంది. సంకల్పం, క్రమ శిక్షణ, నిరంతర శ్రమ ఉంటే ఏ హోదానైనా సాధించవచ్చని ఆయన జీవితం స్పష్టం చేస్తోంది.

**సేవా ప్రస్థానం – నిబద్ధతకు నిదర్శనం**
తహసీల్దార్, RDO, డిప్యూటీ కలెక్టర్, కేంద్ర ప్రభుత్వ సంస్థ HPCLలో డిప్యూటేషన్, ప్రస్తుతం కరీంనగర్ జిల్లా రెవెన్యూ అధికారి (DRO)గా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర–కేంద్ర ప్రభుత్వ స్థాయిల్లో ప్రశంసలు, అవార్డులు పొందారు.

ఈ సేవా రికార్డును గుర్తించి ఆయనకు IASకు పదోన్నతి లభించింది.ఈ సందర్భంగా చెరువు తండా గ్రామ యువత, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తూ వెంకటే శ్వర్లు ప్రయాణం తమకు స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.

**కుటుంబ వివరాలు**
తండ్రి : బాబ్లా
తల్లి : సాజి
భార్య : బి. శారద
కుమార్తె: బేబీ ద్రీవిద్య – VITS, వెల్లూరు (తమిళనాడు)లో M.Tech
కుమారుడు: బి. సాయి చరణ్ – 7వ తరగతి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### దేశంలో ఏదీ బెస్ట్ హనీమూన్ స్పాట్ అంటే

మన దేశంలో ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నప్పటికీ, కేరళలోని మున్నార్ అత్యుత్తమ హనీమూన్ స్పాట్‌గా నిలుస్తుంది. మున్నార్‌లో కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న పచ్చని తేయాకు తోటలు, మంచు మేఘాలు జంటలకు ఒక అద్భుతమైన అనుభూతిని ఇస్తాయి. ఏడాది పొడవునా ఇక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది, ఇది కొత్త జంటలు ఏకాంతంగా సమయం గడపడానికి చాలా బాగుంటుంది.

# ఆన్లైన్ లోనే ఇందిరమ్మకు ఇసుక

- పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా సరఫరా
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ అమలు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్




**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం :**

తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యం లో తెలంగాణ రాష్ట్ర గనులు & భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీ ఎండీసీ) అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు.

ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏడీ మైనింగ్ అధికారులు, పీఓ -టీజీఎండీసీ, సీజీజీ (హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడివోలు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి పట్టణంలోని 19వార్డు కమ్మరివాడలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో దివిస్ ల్యాబ్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్, వాటర్ క్యాన్లను మాజీ కౌన్సిలర్ వడిచర్ల లక్ష్మి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోత్నాక్ ప్రమోద్ కుమార్, తంగెళ్లపల్లి రవి కుమార్, బర్రె జహంగీర్, తాడూరి మల్లేష్, చిన్నగారి బలరాం, తాడూరి అంజయ్య, వడిచర్ల శ్రీరామ్, తాడూరి చంద్రయ్య, చిన్న గారి బాలరాజు, ఉడుత ఆగయ్య, డాకూరి ప్రకాష్, నాగారం శంకర్, శరత్, సాయి, ప్రదీప్ పాల్గొన్నారు.

# ఆర్టీసీకి లాభాల సంక్రాంతి

**ముద్ర, హన్మకొండ :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆర్టీసీకి ఈ సంక్రాంతి లాభాల పంట పండించింది. జనవరి 9 నుంచి 19 వరకు ప్రత్యేక బస్సులను నడిపిన ఆర్టీసీ సుమారు రూ. 26.98 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. సాధారణ రోజుల్లో సుమారు రూ. 2 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చేది. కానీ ఈ సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 9 డిపోల నుంచి సుమారు 650 బస్సులను నడిపారు. దీంతో ఈ ఆదాయం లభించినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.




# అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు ఐఎఎస్ హోదా

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు కేంద్ర ప్రభుత్వం ఐఎఎస్ గా హోదా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గురువారం భువనగిరి, చౌటుప్పల్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్ లు, సూపరింటెండెంట్లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.



# ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మన బాధ్యత




- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ముద్ర, కొత్తగూడెం :**

కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు బజార్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతిష్టాత్మకంగా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను పాటించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో పోలీసు వారు తీసుకునే చర్యలకు ప్రజలందరూ సహకరించాలని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో భాగంగానే నిత్యం పోలీసులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధను విధిస్తున్నారని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణించటం వలన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. అరైవ్ అలైవ్ అనే కార్యక్రమంతో ప్రతిష్టాత్మకంగా కేవలం రోడ్డు ప్రమాదాలను అరికట్టడం కోసం పోలీసులు శ్రమించడం హర్షణీయమని కొనియాడారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్న పోలీస్ శాఖకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్,3టౌన్ సీఐ శివప్రసాద్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్, ఎస్సై విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



# మైనార్టీ గురుకులాల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర, ఖమ్మం :**

ఖమ్మం మైనారిటీ గురుకుల పాఠశాల గర్ల్స్ లో 5 , 6 , 7, 8 వ తరగతి ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తుల ప్రారంభ అయిన సందర్భంగా గురువారం పోస్టర్ ను పాఠశాలలో అబ్దుల్ మాలిక్ మీడియా సెక్రెటరీ జమాఅతె ఇస్లామీ హింద్ ఖమ్మం ,షేక్ ఖాసీం ఎంపీజే జిల్లా అధ్యక్షులు హకీమ్ ఎంపీజే ఉప అధ్యక్షులు, మౌలానా సాధిక్ ఇమామ్ మసీద్ ఇ ఇబ్రహీం, ఆర్ ల్ సి ఎం జె అరుణకుమారి , పాఠశాల ప్రిన్సిపాల్ ఎం శైలజ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు , అధ్యాపకులతో నాణ్యమైన విద్య పోషకాహారంతో పాటు నిరంతర పర్యవేక్షణలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. పాఠశాల నందు 5 వ తరగతి లో 51 ముస్లిం, 5 క్రిస్టియన్స్, 1 జైన్, 1 పార్సి, 1 బౌద్ధ, 1 సిక్కు ,6 వ తరగతిలో 24 ముస్లిం 7 వ తరగతి యందు 4 ముస్లిం, 8 వ తరగతి లో 8 ముస్లిం సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదే విధంగా దరఖాస్తుల వివరాల కోసం 7331170860 ను సంప్రదించగలరని అన్నారు.

# దళిత సాహిత్యానికి చుక్కాని..

- ఘనంగా జరిగిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ సాహిత్యం-సమాలోచన జాతీయ సదస్సు




**ముద్ర, ఖమ్మం :**

ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో ఆచార్య ఎండ్లూరి సుధాకర్ సాహిత్యం సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. రెండు రోజులుగా దాదాపు 15 సెషన్లుగా సుమారు 200 మంది ఎండ్లూరి సుధాకర్ సాహిత్యం పై పరిశోధనా పత్రాలను సమర్పించారు. దాదాపు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వెయ్యి మందికి పైగా అతిథులు, పుర ప్రముఖులు సాహితీ ప్రియులు, కవులు, రచయితలు, విద్యవేత్తలు, రాజకీయ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు . మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ సదస్సులో విద్యార్థినులు ఎంతో ఆసక్తితో పాల్గొని సాహిత్యాన్ని ఆకలింపు చేసుకున్నారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ జాతీయ సాహిత్య సదస్సు మొదటి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ విమర్శకులు ముఖ్య ప్రసంగీకులు గుంటూరు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ ఏండ్లూరు సాహిత్యం దళిత జాతికి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సుపరిచితమైందే వారి సాహిత్యంలో ఎందరో పరిశోధనలు తయారయ్యారని ఎన్నో ఉత్తమ రచనలు చేశారని దళిత సాహిత్యానికి చుక్కని అని కొనియాడారు.

ముగింపు సెషన్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దళిత సాహిత్యంలో పేరెన్నిక గన్న కవి ,రచయిత కీర్తిశేషులు ఎండ్లూరి సుధాకర్ అని కొనియాడారు. దళితుల పక్షాన బలమైన గొంతకనీ ,వారి సాహిత్యాన్నిమరింతగా ప్రజలకు విద్యార్థులకు చేరువ చేయాలని అభిప్రాయపడ్డారు ఇలాంటి సమావేశాలు మరెన్నోభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశమంతటా జరగాలని సూచించారు. ప్రారంభ సమావేశానికి అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భానోత్ రెడ్డి వ్యవహరించారు . ప్రత్యేక అతిధులుగా ప్రొఫెసర్ కాసిం , మువ్వా శ్రీనివాస్ రావు, అప్సర్ , విశిష్ట అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ కే ప్రతాపరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ ఎం కుమార్ పాల్గొని మాట్లాడారు. మరొక అతిథి పోనుగోటి కృపాకర్ మాదిగ విచ్చేసి మాట్లాడారు ఈ కార్యక్రమ నిర్వాహకులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ చేకూరి రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, లెక్చరర్ పేరెల్లి శ్రీను, నిర్వాహకులుగా వ్యవహరించి సభను ముందుండి నడిపించుటలో తోడ్పాటున అందించారు . ఈ వేదిక పైనుండి అనేక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏండ్లూరి సుధాకర్ కుమార్తె మానస , రచయిత్రి జూపాక సుభద్ర , వై చిన్నప్పయ్య ,పరంజ్యోతి , జీవన్ కుమార్ ,డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎన్ గోపి పాల్గొన్నారు.



# కృష్ణారెడ్డి కి ఎంపీ రవిచంద్ర నివాళి

- గాదెపాడులో మృతదేహం సందర్శన

**ముద్ర, ఖమ్మం :**

కారేపల్లి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డికి ఎంపీ వద్దిరాజు నివాళులు అర్పించారు. గురువారం ఆయన స్వగ్రామంలో ఉంచిన ఆయన భౌతిక కాయాన్ని ఎంపీ రవిచంద్ర సందర్శించి, పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీ రవిచంద్ర వెంట ఖమ్మం నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల నాయకుడు ముత్యాల వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు.

# గందమల్ల ప్రభుత్వ పాఠశాలలో విచారణ

- విద్యార్థుల ఫిర్యాదులపై గ్రామానికి చేరుకున్న హక్కుల సంఘాల ప్రతినిధులు

**ముద్ర, తుర్కపల్లి:**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని గందమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలపై విద్యార్థులు చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం గందమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 1098 బాలల సహాయ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల ఫిర్యాదులను గంభీరంగా పరిగణించిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్,నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ ఇంతియాజ్ గురువారం గందమల్ల గ్రామానికి చేరుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యార్థులు చేసిన ఆరోపణలపై పూర్తి వివరాలు సేకరించారు. ప్రధానోపాధ్యాయురాలితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశమై, జరిగిన అంశాలపై స్పష్టత కోరుతూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వారి చెప్పిన విషయాలను సైతం పరిశీలించారు. సేకరించిన పూర్తి వివరాలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాధికారికి అందజేస్తామని తెలిపారు.



# స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో ఘనంగా తిరుప్పావడ సేవ

- అంగరంగ వైభవంగా నిత్య కల్యాణోత్సవం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం తిరుప్పావడ ఘనంగా నిర్వహించారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండాలని స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన ట్టి గోపృష్ఠ దర్శనాన్ని భక్తులకు కల్పించారు.

మణిమయ శోభిత స్వర్ణాభరణాలతో, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి, వేయి నామాలతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్రనామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి నిత్య కళ్యాణ మహోత్సం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు ఆదిమధ్యాంత రహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ, భక్తుల గోవింద నామస్మరణలతో, మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.



రోజువారీ ఆరోగ్యానికి
ఉదయం లేవగానే గోరు వెచ్చని నీరు ఒక గ్లాస్ తాగండి.
రోజుకు కనీసం 7–8 గంటల నిద్ర తప్పనిసరి.
రోజూ 30 నిమిషాలు నడక లేదా యోగ చేయండి.
జంక్ ఫుడ్ తగ్గించి, ఇంటి ఆహారం ఎక్కువగా తీసుకోండి.

# హామీలు అమలయ్యేదాకా ప్రశ్నిస్తాం

- కేసీఆర్ డబ్బులు వేస్తే లాక్కుంటున్న సీఎం
- మాజీ మంత్రి హరీష్ రావు



ముద్ర ప్రతినిధి, మెదక్:

ఎన్ని నోటీసులు పంపినా హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తేల్చి చెప్పారు. గురువారం మెదక్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కొండన్ సావిత్రి సురేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన మెదక్ లో ఏర్పాటు చేసిన సభలో హరీష్ రావు మాట్లాడుతూ ట్రాఫిక్ చలాన్ల పేరుతో ప్రజలకు తెలియకుండానే బ్యాంక్ అకౌంట్ల నుంచి డబ్బులు కట్ చేస్తామని రేవంత్ రెడ్డి అనడం తగదన్నారు. నువ్వు ముఖ్యమంత్రివా లేక సైబర్ నేరగానివా అని ప్రశ్నించారు.

కేసీఆర్ ప్రజల ఖాతాల్లో డబ్బులు వేస్తే, రేవంత్ రెడ్డి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని కేటీఆర్ ఒకవైపు గట్టిగా నిలదీస్తున్నారని, మరోవైపు తానూ నిలదీయడంతో సమాధానాలు లేక సిట్ నోటీసులు పంపిస్తుందని రేవంత్ రెడ్డి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రేమ లేఖలాగా సిట్ నోటీసులు ఇచ్చినా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మహాలక్ష్మి, రైతు రుణమాఫీ, అవ్వాతాతలకు 4వేలు, తులం బంగారం ఇచ్చేదాకా అడుగుతూనే ఉంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ డబ్బులు ఇచ్చేదాకా రేవంత్ రెడ్డి వెంటపడుతూనే ఉంటామన్నారు. హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీలకు 4 వేల కోట్లు బడ్జెట్ పెడతామని మోసం చేశారన్నారు. ఇమామ్, మౌజంలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ రైతుబంధు నిధులు నాట్లకు ఇస్తే, రేవంత్ రెడ్డి కేవలం ఓట్ల కోసమే ఇస్తున్నారని దుయ్యబట్టారు. అవ్వతాతలకు రూ. 50 వేల పెన్షన్ బకాయి పడ్డారన్నారు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద రూ. 62,500 బాకీ పడ్డారన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చీరలు పంచుతుంటే మహాలక్ష్మి పైసలు ఎప్పుడు ఇస్తావ్ అని మహిళలు నిలదీశారన్నారు. మంత్రి వివేక్ చెన్నూరులో పర్యటిస్తుంటే ఈ రోడ్ ఎట్లుందని, వీధి దీపాలు ఏవని అడిగారన్నారు. మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి మీద మహాలక్ష్మి డబ్బులు ఎప్పుడు ఇస్తారని మహిళలు తిరగబడ్డారన్నారు. హైదరాబాదులో తిరుగుతున్న పొన్నం ప్రభాకర్ ను నిలదీశారని హరీష్ రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ కు ఓటేస్తే జిల్లా రద్దు**

మెదక్ లో కాంగ్రెస్ కు ఓటు వేయడం అంటే మన జిల్లాను మనమే రద్దు చేసుకోవడమని హరీష్ రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లాను రద్దు చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించి రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని కోరారు. 40 ఏళ్లు కాంగ్రెస్ మోసం చేస్తే.. మెదక్ ను జిల్లా చేసి, మెడికల్ కాలేజీ, రైలు, కలెక్టరేట్ తెచ్చింది కేసీఆర్ అని గుర్తు చేశారు. పదేళ్లు ఘనపురం నీళ్లు పారిస్తే, నేడు కాంగ్రెస్ పుణ్యమా అని క్రాప్ హాలిడే వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయిందని, మెదక్ అభివృద్ధి కోసం చేసిన ఒక్క పనిని చూపించగలరా అని ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి- - ఎమ్మెల్యే సునీత**

మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వి. సునీత రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా నోటీసులు, విచారణ పేరుతో భయపెట్టే చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం, ఎమ్మెల్యే ప్రవర్తన, పరిపాలన ఒకే రకంగా ఉందన్నారు. బల్దియాలో ఒక్క పని జరగడం లేదన్నారు. ఇసుక దందాపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఎమ్మెల్యే ను ద్దేశించి ఆరోపించారు. ఆసుపత్రికి పోతే పట్టించుకునే వారు లేరన్నారు. అంతకు ముందు పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, ఫారుక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, మల్లికార్జున గౌడ్, జితేందర్ గౌడ్, అశోక్ గౌడ్, నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి, ప్రభు రెడ్డి, జీవన్ రావు, సావిత్రి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, సోములు, పుట్టి విజయలక్ష్మి, సురేందర్ గౌడ్, మా మిళ్ల ఆంజనేయులు, జెల్లా గాయత్రి, చంద్రకళ, విజయలక్ష్మి, ఉదయ్ కుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



ముద్ర, నిజామాబాద్:

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎస్సీలు తగిన గుణపాఠం చెప్పాలని దళిత నాయకులు డాక్టర్ పులి జైపాల్, మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఎస్సీ డివిజన్‌లపై హైకోర్టు లో బీజేపీ వేసిన పిటీషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని ప్రెస్ క్లబ్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేవలం ఎస్సీ డివిజన్‌లు 39, 40, 44 లలో రిజర్వేషన్లను సవాలు చేస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మీనారాయణ హైకోర్టులో స్టే పిటిషన్ దాఖలు చేయడంతో ఎస్సీల పట్ల బీజేపీ వైఖరి మరో మారు బయటపడిందని విమర్శించారు. 60 డివిజన్‌లలో రిజర్వేషన్లపై పిటిషన్ వేయాల్సిన వారు, వారి రాజకీయ లబ్ధి కోసం కేవలం ఎస్సీ డివిజన్ల పై వేసి ఎస్సీలను రాజకీయ బలి పశువులుగా చేస్తున్నారని మండిపడ్డారు.

## సింగరేణి టెండర్లపై విచారణ జరపండి

సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్

ముద్ర, హైదరాబాద్:



2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో బొగ్గు టెండర్లు... తీసుకున్న అనాలోచిత నిర్ణయాలపై విచారణ జరిపి అవినీతిని బయటపెట్టాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కేంద్ర కేబినెట్ లో కీలకంగా ఉన్నార న్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ కూడా ఆయన పరిధిలోకే వస్తుందని చెప్పారు. వెంటనే విజిలెన్స్ తో విచారణ జరిపించి... సింగరేణిలో జరిగిన అవినీతిని బయటపెట్టాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. శాఖలో ఏ అవినీతి జరిగింది..? ఏ కుంభకోణాలు జరిగాయో మీ వద్ద ఉండే అధికారులతో విచారణ జరిపి రిపోర్టును సీబీఐకి అప్పగించాలన్నారు. ఉదయం లేస్తే పనికి రాని ఆరోపణలతో ప్రజల దృష్టిమరల్చేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ముందు తెలంగాణకు రావాల్సిన బకాయిలను, నిధులను తీసుకు రావాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఆర్మీ తర్వత అత్యంత ప్రమా దకర పరిస్థితుల్లో పనిచేసేది సింగరేణి కార్మి కులేనని వాళ్లు కట్టే ఆస్తిపన్నును మాఫీ చేయించాలని కోరారు.

## సరైన సమయంలో బీసీ సీఎం అవుతారు

టీపీసీసీ -చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ముద్ర, హైదరాబాద్:



రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నాయకుడు సీఎం అయ్యే సమయంలో కచ్చితంగా అవుతారని చెప్పారు. భవిష్యత్తులో బీసీలకు చాలా అవకాశాలు వస్తాయన్నారు. గురువారం ఆయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. అవకాశం ఉన్న ప్రతీ చోట బీసీలకు పదవులు ఇస్తూ వెళ్తున్నామని చెప్పారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు వస్తుందని.. దీనిని ఎవరూ ఆపలేరని అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరిట రాజకీయాలు దేశానికి మంచిది కాదని, కులం, మతం అనేవి మన పిల్లలకు భవిష్యత్తును తీసుకురావని మహేశ్ గౌడ్ అన్నారు. రాముడు, అంజనేయుడి పేరు చెప్పి బీజేపీ వాళ్లు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ జై శ్రీరాం అని అనకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలన్నారు. ఆయన రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు. దేవుళ్లతో రాజకీయాలను ముడి పెట్టవద్దని అన్నారు.

## ఇప్పుడు కాదు..

## వచ్చేనెల 5న తీర్పు

గ్రూప్ -1పై అయోమయం

ముద్ర, తెలంగాణ బ్యూరో :

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలపై నేడు తుది తీర్పు వెలువడుతుందని ఆశించిన వేలాది మంది అభ్యర్థుల ఆశలు నెరవేరలేదు. హైకోర్టు నుంచి ఊహించని ట్విస్ట్ ఎదురవడంతో తీర్పు మరోసారి వాయిదా పడింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష ఫలితాలపై కొంతకాలంగా న్యాయపరమైన వివాదం కొనసాగుతోంది. మూల్యాంకనంలో లోపాలు జరిగాయని, మార్కుల కేటాయింపులో పారదర్శకత లేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పులో గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేసి, తిరిగి మూల్యాంకనం (రీ–వాల్యుయేషన్) చేయాలని ఆదేశించింది. ఈ తీర్పు వెలువడిన వెంటనే అభ్యర్థుల్లో ఆశలు చిగురించగా, ప్రభుత్వం మరియు టీజీపీఎస్సీ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర భుత్వం, టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన రీ–వాల్యుయేషన్ ఆదేశాలపై స్టే విధించింది. ఇప్పటికే ఈ పరీక్ష ద్వారా ఎంపికైన 562 మందికి నియామక పత్రాలు కూడా అందజేసింది. అయితే ఈ నియామకాలు కోర్టు తుది తీర్పుపై ఆధారపడి ఉండటంతో, ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల్లోనూ, కేసు వేసిన అభ్యర్థుల్లోనూ అనిశ్చితి కొనసాగుతోంది. ఈ కేసుపై నేడు తుది తీర్పు వెలువడుతుందని భావించిన అభ్యర్థులు ఉదయం నుంచే హైకోర్టు నిర్ణయంపై ఉత్కంఠగా ఎదురు చూశారు. గురువారం ఈ కేసును విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని లాయర్లకు తెలియజేసి, తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.కానీ అనూహ్యంగా తీర్పు కాపీ సిద్ధం కాలేదని డివిజన్ బెంచ్ వెల్లడించడంతో విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. దీంతో నేడు తీర్పు వస్తుందన్న అంచనాలు పూర్తిగా తారుమారయ్యాయి. భవితవ్యాన్ని నిర్ణయించే కీలక తీర్పు కోసం అభ్యర్థులు మరోసారి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది

## గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



ముద్ర, కమ్మర్పల్లి:

క్రీడాకారులు గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఇండోర్ మైదానంలో జరుగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్–17 (బాలబాలికల) టోర్నమెంట్, ఎంపికల పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఎప్పుడూ క్రీడాకారులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కమ్మర్‌పల్లి, వేల్పూర్ వేదికగా రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని మరే నియోజకవర్గంలో లేని విధంగా బాల్కొండ నియోజకవర్గంలో రెండు ఇండోర్ స్టేడియంలు కమ్మర్‌పల్లి, వేల్పూర్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మౌలిక సదుపాయాలను కల్పించుకున్నామని, వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన తండ్రి, స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి గొప్ప క్రీడాకారుడని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో వేముల సురేందర్ రెడ్డి పేరుపై రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించడానికి అసోసియేషన్ , అధికారులు చొరవ తీసుకుంటే తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. జీవిత పాఠాలు నేర్పే క్రీడలు నిజ జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను, కష్టనష్టాలను తట్టుకునే మానసిక స్థైర్యం క్రీడల ద్వారానే అలవడుతుందని తెలిపారు.

క్రీడాకారులకు, అసోసియేషన్ సభ్యులకు తన సహకారం ఉంటుందని, క్రీడల నిర్వహణలో ఎవరూ వెనకడుగు వేయవద్దని సూచించారు. క్రీడల నిర్వహణలో పీఈటీలు, నిర్వాహకులు చూపిస్తున్న చొరవను, వారి అంకితభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, క్రీడా సంఘం బాధ్యులు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శోభన్, నాగమణి, నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి , పీఈటీలు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, నీరజ రెడ్డి, ఎంఈవో సాయన్న, తహసీల్దార్ ప్రసాద్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు వాట్సాప్ సేవలు

ముద్ర ప్రతినిధి, మెదక్:



మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తొలిసారిగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భక్తులు 76589 12300 నంబర్‌కు 'Hi' అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన పూర్తి వివరాలు పొందవచ్చని సూచించారు. జాతర రూట్ మ్యాప్, ట్రాఫిక్ అప్‌డేట్స్, పార్కింగ్, వైద్య కేంద్రాలు, స్నాన ఘట్టాలు తదితర సమాచారం వాట్సాప్‌లో లభించనుందన్నారు. భక్తులకు మరింత సౌకర్యం కలగ నుందన్నారు.

**విచారణ..**

రామాయంపేట్ మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై నిజా నిజాలు ల్చేందుకు జిల్లా ఆడిట్ ఆఫీసర్ ను విచారణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆరోపణలపై విచారణ చేపించాల్సిందిగా కలెక్టర్ ను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కోరారు.

**సాండ్ బజార్ పరిశీలన..**

మెదక్ లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఇసుక నిల్వలపై ఆరా తీశారు. సాండ్ బజార్ ఇసుక అమ్మకాలు వేగంగా జరగాలని సూచించారు. ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మైనింగ్ ఆర్ఐ తదితరులు ఉన్నారు.

# మహాలక్ష్మీ పథకంలో మార్పులు

ఉచిత ప్రయాణానికి ఒక్కటే కార్డు

ముద్ర, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో త్వరలో కీలక మార్పులు రానున్నాయి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మరింత పారదర్శకంగా.. సులభతరం చేసేందుకు 'మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల' పంపిణీకి ఆర్టీసీ రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డులు చూపించి జీరో టికెట్ దుతున్న విధానానికి స్వస్తి చెప్పి.. ఆధునిక చిప్‌తో కూడిన కార్డులను ప్రవేశపెట్టనున్నారు.

ఈ స్మార్ట్ కార్డులు ప్రతి మహిళకు ఒక ప్రత్యేక గుర్తింపును ఇస్తాయి. దీనిలో భద్రత కోసం 16 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫోటోతో పాటు పేరు, గ్రామం, మండలం మరియు జిల్లా వివరాలు ముద్రించి ఉంటాయి. కార్డు వెనుక భాగంలో నిబంధనలు ఉంటాయి. లోపల ఉండే చిప్ ద్వారా కండక్టర్ వద్ద ఉండే యంత్రంతో స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. ఈ కార్డుల తయారీ, పంపిణీ కోసం సుమారు రూ. 75 కోట్ల నిధులు కావాలని ఆర్టీసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఈ కార్డులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా 5 లక్షల కార్డులను పంపిణీ చేసి.. దాని ఫలితాల ఆధారంగా రాష్ట్రమంతటా విస్తరిస్తారు. లబ్ధిదారుల గుర్తింపు కోసం ఇటీవల ప్రభుత్వం చేపట్టిన 'సమగ్ర కుటుంబ సర్వే' వివరాలను ప్రామాణికంగా తీసుకుంటారు. పౌరసరఫరాల శాఖ డేటాను ఉపయోగించి, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (CGG) ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు.

**స్మార్ట్ కార్డుతో కలిగే ప్రయోజనాలు...**

ఈ విధానం వల్ల అటు ప్రయాణికులకు, ఇటు ఆర్టీసీ యాజమాన్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. అనర్హులు ఈ పథకాన్ని వాడుకోకుండా అడ్డుకోవచ్చు.. ఏ మార్గాల్లో రద్దీ ఎక్కువగా ఉంది, ఏ సమయంలో మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు వంటి ఖచ్చితమైన సమాచారం లభిస్తుంది. వీటితో పాటు. రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం యాజమాన్యానికి సులభమవుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# లక్ష్యాలు చేరుకోని ఆయిల్ పామ్ కంపెనీల జోన్లు రద్దు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- నిర్దిష్ట లక్ష్యాలు చేరుకోకపోతే ఆయిల్ ఫెడ్ సంస్థ జోన్లూ రద్దు
- ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపే సర్కార్ లక్ష్యం

**ముద్ర, హైదరాబాద్ :**



ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో లేని జిల్లాల్లో ఉన్న ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఆసక్తి కలిగిన ఇతర కంపెనీలకు ఇవ్వాలని సూచించారు. గురువారం సచివాలయంలో టీజీ ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, విత్తనోత్పత్తి సంస్థల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్ , హన్మకొండ జిల్లాలలోని ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన జోన్లను ఇప్పటికే రద్దు వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోవడంలో ఆయిల్ ఫెడ్ సంస్థ కూడా విఫలమైతే ఆ సంస్థకు సంబంధించిన జోన్లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వఉద్దేశ్యమన్నారు. అందుకోసం ఎలాంటి కఠిన నిర్ణయాలైన తీసుకుంటామన్నారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ త్వరితగతిన విస్తరణ కోసం అవసరమైన చోట అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను చేర్చుకోవాలని ఆయిల్ ఫెడ్ ఎండీకి సూచించారు. అయిల్ పామ్ సాగుకు అవసరమైన పనిముట్లను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగం చేయాలన్నారు. దీంతో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు సాగు ఖర్చు ఆదా అవుతుందన్నారు. రైతులు సాగు కోసం చేసే ఖర్చును తగ్గించడానికి అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలించాలన్నారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ తర్వాత వచ్చే వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారుచేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కల్లూరుగూడం, బీచుపల్లిలోని ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగులో దిగుబడి పెంచడం కోసం ఆయిల్ పామ్ రైతులకు ట్రైకోడర్మా, గానోడెర్మా నిరోధక బయో ఫర్టిలైజర్లు అయిన వీఏయం, మెగ్నీషియం, సల్ఫర్ మొదలైన వాటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర సేవల కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను పామ్ ఆయిల్ రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్ ఫెడ్ ఎండీకి సూచించారు. ఆయిల్ పామ్ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పామ్ ఆయిల్‌పై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకం 16.5 శాతం నుండి గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్ చపియూష్ గోయల్‌తో పాటు ప్రధాని మోడీకి కూడా లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

**మొక్క జొన్న ధాన్యానికి టెండర్లు పిలిచి అమ్మకాలు చేపట్టాలి :**

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న ధాన్యానికి వెంటనే టెండర్లు పిలిచి అమ్మాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. ప్రొక్యూర్ మెంట్, సీడ్ వెరైటీలు, స్టోరేజీల నిర్వహణలకు సంబంధించి ఇంకా పాత పద్ధతులనే అవలంభిస్తున్నామని, పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని కొత్త విధానాలను రూపొందించాలన్నారు. మార్క్ ఫెడ్ లాంటి సంస్థల ద్వారా కేవలం మన రాష్ట్రంలోనే ఇంత పెద్దమొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు నష్టం రావొద్దనే ఉద్దేశ్యంతోనే చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి కూడా నష్టం రాకుండా ప్రణాళికలు తయారుచేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో ఎక్కువ కాలం స్టోరేజీ చేయకుండా, పంట పాడవకముందే మంచి ధర రాగానే అమ్ముకోవాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యత కలిగిన అధిక దిగుబడి వచ్చే విత్తనాలను తయారుచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని విత్తనాభివృద్ధి సంస్థ ఎండీకి సూచించారు. ప్రైవేట్ కంపెనీలకు ధీటుగా విత్తనాభివృద్ధి సంస్థ కూడా విత్తనాలను ఉత్పత్తి చేయాలన్నారు. సీజన్‌కు ముందే రైతు సాగుచేసే విస్తీర్ణాన్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు విత్తనాభివృద్ధి సంస్థ తయారుచేసే విత్తనాలనే కొనుగోలు చేసేలా వారిలో నమ్మకం కల్పించాలని, అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకొవాలన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గిడ్డంగుల కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థల ఎండీ యాస్మిన్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

# సీఎం సరేనంటే.. సింగరేణి 11 ఏండ్ల నిర్ణయాలపై దర్యాప్తు

- 2014 నుంచి ఇప్పటి వరకు టెండర్లపై విచారణ జరగాల్సిందే
- సీబీఐనీ రాష్ట్రంలో రానీయకుండా చేసిందెవరూ..?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ముద్ర,హైదరాబాద్ :**



2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణి కాలరీస్ సంస్థలో జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర దర్యాప్తు జరపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. నైనీ కోల్ మైన్స్ టెండర్ల కుంభకోణంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా నిబంధనలు విధించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. అప్పుడు హరీశ్ రావు ఏమి చేశారని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి దోచుకున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఇప్పుడంటే ఇప్పుడే సింగరేణి అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. ప్రభుత్వానికి పారదర్శకతపై నిజంగా నమ్మకం ఉంటే సీబీఐ విచారణకు వెంటనే అనుమతి ఇవ్వాలని సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ వివాదంపై స్పందించిన ఆయన... ఈ కంటోన్మెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంటోన్మెంట్ల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోందని వెల్లడించారు. స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# నీటి నిర్వహణపై జాతీయ వేదిక : IWWA మహాసభలో ESCI కీలక పాత్ర

**ముద్ర, ఔరంగాబాద్ :**

ఛత్రపతి సంభాజీనగర్ (ఔరంగాబాద్)లో ఇండియన్ వాటర్ వర్క్స్ అసోసియేషన్ (IWWA) ఆధ్వర్యంలో 58వ వార్షిక మహాసభను జనవరి 22 నుంచి 24, 2026 వరకు మరాఠ్వాడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT) క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ జాతీయ స్థాయి మహాసభను IWWA ముంబై సెంటర్, MIT మరియు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించాయి. “Design Today - Sustain Tomorrow” (నేడు రూపకల్పన - రేపటి స్థిరత్వం) అనే ప్రధాన థీమ్‌తో సాగిన ఈ సదస్సులో నీటి పునర్వినియోగం, స్థిరమైన నిర్వహణ, సమకాలీన నీటి సవాళ్లపై దేశవ్యాప్తంగా వచ్చిన నిపుణులు, విద్యావేత్తలు, ఇంజినీర్లు, విధాన నిర్ణయకులు విస్తృతంగా చర్చించారు. ఈ మహాసభలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ESCI) తరఫున డైరెక్టర్ డా. జి. రమేశ్వర్ రావు పాల్గొని, ESCI - వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ (WRD) విభాగం ద్వారా చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను వివరించారు. భూగర్భజల రీచార్జ్, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, డ్యామ్ గేట్ల భద్రత, హైడ్రాలిక్ గేట్ల నిర్వహణ, మైక్రో ఇరిగేషన్ ఆటోమేషన్, డ్యామ్ సేఫ్టీ మార్గదర్శకాలపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ESCI స్టాల్‌ను చీఫ్ ఇంజినీర్ శ్రీమతి మానిషా పాలందే మరియు కమిషనర్ శ్రీ జి. శ్రీకాంత్ ప్రారంభించగా, ESCI స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కార్యకలాపాలను చూపించే ఫోటో ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన లభించింది.



## ఎన్నికల విధుల్లో మెరుగైన సేవలకు నగదు పురస్కారం

**ముద్ర, వనపర్తి :**

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, ప్రజలకు పూర్తి భద్రత కల్పిస్తూ నిర్వహించడంలో ఎలక్షన్ సెల్ పోలీసు అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. వారి కృషి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రత్యేకంగా కృషి చేసిన ఎలక్షన్ సెల్ పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిబంధనల అమలు, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లు చేయడం, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ, పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తతతో విధులు నిర్వహించడం వల్ల జిల్లాలో ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా ముగిసాయని ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రామేశ్వర్ రెడ్డి, డీసీఆర్‌బి ఎస్సై తిరుపతిరెడ్డి, పోలీసు సిబ్బంది వెంకటన్నగౌడ్, రవీంద్రబాబు, నగేష్, శ్రీనునాయక్, రంజిత్‌లకు నగదు పురస్కారాలు అందజేశారు. వారి సేవలు పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొంటూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇదే స్థాయిలో ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, డిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రామేశ్వర్ రెడ్డి, పోలీసు అధికారులు, ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మిలో మార్పులు

- ఉచిత ప్రయాణానికి ఒక్కటే కార్డు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో త్వరలో కీలక మార్పులు రానున్నాయి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మరింత పారదర్శకంగా.. సులభతరం చేసేందుకు 'మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల' పంపిణీకి ఆర్టీసీ రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆధార్ లేదా ఓటర్ ఐడీ కార్డులు చూపించి జీరో టికెట్ పొందుతున్న విధానానికి స్వస్తి చెప్పి.. ఆధునిక చిప్‌తో కూడిన కార్డులను ప్రవేశపెట్టనున్నారు.

ఈ స్మార్ట్ కార్డులు ప్రతి మహిళకు ఒక ప్రత్యేక గుర్తింపును ఇస్తాయి. దీనిలో భద్రత కోసం 16 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫోటోతో పాటు పేరు, గ్రామం, మండలం మరియు జిల్లా వివరాలు ముద్రించి ఉంటాయి. కార్డు వెనుక భాగంలో నిబంధనలు ఉంటాయి. లోపల ఉండే చిప్ ద్వారా కండక్టర్ వద్ద ఉండే యంత్రంతో స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. ఈ కార్డుల తయారీ, పంపిణీ కోసం సుమారు రూ. 75 కోట్ల నిధులు కావాలని ఆర్టీసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఈ కార్డులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా 5 లక్షల కార్డులను పంపిణీ చేసి.. దాని ఫలితాల ఆధారంగా రాష్ట్రమంతటా విస్తరిస్తారు. లబ్ధిదారుల గుర్తింపు కోసం ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ‘సమగ్ర కుటుంబ సర్వే’ వివరాలను ప్రామాణికంగా తీసుకుంటారు. పౌరసరఫరాల శాఖ డేటాను ఉపయోగించి, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (CGG) ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు.

**స్మార్ట్ కార్డుతో కలిగే ప్రయోజనాలు...**

ఈ విధానం వల్ల అటు ప్రయాణికులకు, ఇటు ఆర్టీసీ యాజమాన్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. అనర్హులు ఈ పథకాన్ని వాడుకోకుండా అడ్డుకోవచ్చు.. ఏ మార్గాల్లో రద్దీ ఎక్కువగా ఉంది, ఏ సమయంలో మహిళలు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు వంటి ఖచ్చితమైన సమాచారం లభిస్తుంది. వీటితో పాటు. రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడం లేదా తగ్గించడం యాజమాన్యానికి సులభమవుతుంది. ప్రతిసారి ఆధార్ కార్డులు సరిచూడాల్సిన అవసరం ఉండదు. స్మార్ట్ కార్డు స్కాన్ చేయడం ద్వారా పని భారం తగ్గుతుంది.. పేపర్ లెస్ ప్రయాణం సాధ్యమవుతుంది.

# జనప్రియ 5 ఫేజ్ అభివృద్ధికి అడుగు: కమ్యూనిటీ హాల్‌కు నిధుల ప్రతిపాదనలు

**ముద్ర, హఫీజ్‌పేట్ :**

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ 5 ఫేజ్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి, రూ.10 లక్షల అంచనా వ్యయంతో (SDF నిధులు) నిర్మాణం చేపట్టేందుకు నిధుల మంజూరుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన ప్రతిపాదన పత్రాలను సీనియర్ నాయకులు శ్రీ బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ సభ్యులకు గౌరవ PAC ఛైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ అందజేశారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాల్ అవసరాన్ని గుర్తించి ఈ ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. PAC ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ, నిధులు మంజూరైన వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. చిన్న సమావేశాలు, సభలు, ఫంక్షన్ల నిర్వహణకు అనుకూలంగా హాల్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. జనప్రియ 5 ఫేజ్ కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధమని, ప్రజల సమస్యలు తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. హఫీజ్‌పేట్ డివిజన్ మరియు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బడ్జెట్ పెట్టేటప్పుడు ప్రతి అంశం ఉండేలా చూస్తున్న

- పాదయాత్ర సమయంలో నేను చూసిన మనిషి, ఊరును మరచిపోలేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ముద్ర, ఆదిలాబాద్:**



తాను పాదయాత్రలో చూసిన ప్రజల కష్టాలు తీరేలా బడ్జెట్ పెట్టే సమయంలో జాగ్రత్త తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా మోడీ జూరి గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆనాడు పాదయాత్ర సందర్భంగా మోడీ జురి గ్రామానికి చేరుకున్నానని గుర్తు చేశారు. ఆరోజు ఉగాది పండుగ మూడు రోజులపాటు ఇక్కడే ఉన్నానన్నారు. వెంకట్రావు పొలంలో అరకదున్నానని, ఆ తర్వాత లక్ష్మణరావు పటేల్ ఇంట్లో అందరం కలిసి తిన్నామని గుర్తు చేసుకున్నారు. తాను పాదయాత్ర చేసిన గ్రామాలు, మనుషులు, సమస్యలు ఏ ఒక్కటి మర్చిపోలేదని తెలిపారు. అందులో భాగంగానే మహిళలు ప్రయాణానికి ఇబ్బందులు పడొద్దని ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని తీసుకువచ్చామన్నారు. ప్రపంచ స్థాయి లో మన పిల్లలు పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా ఐటీడీఏ లను బలోపేతం చేసేందుకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.17 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మహిళలు బట్టలు కొనుగోలుకు పడే ఇబ్బందులను గుర్తించి నాణ్యమైన చీరలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. దొడ్డు బియ్యం పురుగులతో ఉన్నాయని ఆనాడు సమస్య వివరించగా ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నమని పేర్కొన్నారు. ఇవన్నీ కూడా ఆనాడు ప్రజలు చెప్పిన సమస్యలకు సమాధానాలు అని గుర్తు చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు

- దేశం, ప్రజల భద్రత కోసం చేస్తారు
- అది పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది
- ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు
- మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదు
- రేవంత్ చెప్పుచేతల్లో ‘సిట్’
- కూర్చోమంటే కూర్చుకుంటది... స్టాండ్ అంటే నిలుస్తది
- పాలన గాలికొదిలేసి డ్రామాలాడుతున్నడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, హైదరాబాద్ :**



ఫోన్ ట్యాపింగ్ నేరమేమి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. దేశం, ప్రజల భద్రత కోసం ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే అది జరుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులు ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గురువారం సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా ట్రాష్ కేసు.. ఇందులో ఏం ఉండదని కొట్టిపారేశారు. అసలు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందు విచారించాల్సింది ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డినే అని అన్నారు. ఆయనను వదిలేసి మమ్మల్ని పిలిస్తే ఏం వస్తదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షాల ఫోన్‌లను రేవంత్ రెడ్డి కూడా ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తాము విచారణ జరిపిస్తే వీళ్లంతా కూడా జైలుకు పోతారని అన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఇద్దరూ తమ ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురవుతున్నాయని అన్నారు. మరి వారి వ్యాఖ్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. హామీల అమలును తప్పించుకోవడానికే సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. సిట్.. రేవంత్ రెడ్డి సిట్ అంటే కూర్చుంటది.. స్టాండ్ అంటే నిల్చుంటదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరుతో కొన్ని రోజులు డ్రామా.. ఈ కార్ రేసు కొన్నిరోజులు, గొర్రెల స్కామ్ అంటూ కొన్ని రోజులు, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంటూ కొన్ని రోజులు డ్రామా చేసి వదిలేస్తారని చెప్పారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ కు సంబంధించిన సింగరేణి కుంభకోణాన్నిబయటపెట్టినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హరీష్‌రావుకు, తనకు నోటీసులు ఇచ్చిందన్నారు. , ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రలు ఎవరైనా చేస్తే దాని నుంచి ప్రభుత్వాలను కాపాడటం కోసం 1952(నెహ్రూ కాలం) నుంచి నేటి వరకు నిఘా వ్యవస్థలు చేస్తాయని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# సంచార జాతుల్లో 50 కులాలు



- సిఫార్సులకు బీసీ కమిషన్ ఆమోదం
- త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక
- ఆర్డీవో ద్వారా సర్టిఫికెట్

ముద్ర, హైదరాబాద్, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ సంచార జాతుల అభ్యున్నతికి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 50 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ చేసిన సిఫార్సుల నివేదికను అధికారికంగా ఆమోదించింది. ఈ నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సీడ్' (SEED) పథకం ద్వారా సంచార వర్గాలకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపడుతున్నారు. ఈ పథకంలో లబ్ధి పొందాలంటే డి.ఎన్.టి (డీ-నోటిఫైడ్ ట్రైబ్స్) సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రస్తుతం తహశీల్దార్ స్థాయిలో జారీ అవుతున్న ఈ సర్టిఫికెట్ల ప్రక్రియలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని కమిషన్ భావిస్తోంది. అందుకే ఇకపై ఈ ధృవీకరణ పత్రాలను నేరుగా ఆర్.డి.ఓ (RDO) ద్వారా జారీ చేయాలని కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ప్రభుత్వానికి సూచించారు. దీని వల్ల ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు అర్హులైన వారికి వేగంగా లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. ఖైరతాబాద్‌లో జరిగిన కమిషన్ సమావేశంలో అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై విస్తృత చర్చ జరిగింది. ఈ సమావేశంలో సంచార జాతుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**కాంట్రాక్టు ఉద్యోగుల్లో బీసీల వాటా..?**

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను బీసీ కమిషన్ సేకరిస్తోంది. ఆర్థిక శాఖ మినహా మిగిలిన అన్ని విభాగాల నుంచి డేటా అందినట్లు కమిషన్ వెల్లడించింది. ఈ సమాచారం ఆధారంగా ఉపాధి రంగంలో బీసీల ప్రాతినిధ్యాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచేందుకు కొత్త విధానాల రూపకల్పన చేయనున్నారు.

**త్వరలో ప్రభుత్వానికి తుది నివేదిక..**

గుర్తించిన 50 సంచార జాతుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, మెంబర్ సెక్రటరీ బాల మాయాదేవి పాల్గొన్నారు. సంచార వర్గాలకు విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కమిషన్ నిర్ణయించింది.

# మినీ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హైదరాబాద్ వేదిక

- ఫాలోఅప్ సదస్సు నిర్వహణకు ఫోరం ప్రతినిధుల హామీ
- నిర్ణయాల పురోగతిని సమీక్షకు సదస్సు దోహదపడుతుందని వ్యాఖ్య
- కీలక ప్రతినిధులతో సీఎం బృందం భేటీ
- ఇప్పటికే చైనాలో సమ్మర్ దావోస్.. ఆసక్తి కనబరుస్తోన్న సౌదీ అరేబియా
- ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్
- శంషాబాద్ , గాగిల్లాపూర్ లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ..

ముద్ర, దావోస్ :

రైజింగ్ తెలంగాణ 2047 విజన్‌తో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా దూసుకుపోతున్న తెలంగాణకు మరో కీలక అంతర్జాతీయ వేదిక దక్కనుంది. ఏటా జనవరిలో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం ఫాలోఅప్ సమావేశంగా హైదరాబాద్‌లో 'మినీ దావోస్' సదస్సు నిర్వహించేందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. జూలై లేదా ఆగస్టు నెలల్లో హైదరాబాద్‌లో ఈ సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించగా, ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, డిజిటల్ ఎకానమీ స్ట్రాటజీ హెడ్ మంజు జార్జ్ దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దావోస్ సదస్సులో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఈ ఫాలోఅప్ సమావేశం దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులతో భేటీ అయింది. తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎం ఆకాంక్ష వ్యక్తం చేశారు. బయోఏషియా-2024లో ప్రారంభించిన సీఐఎఫ్ఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిని కూడా వివరించారు. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఇది ఆదర్శ మోడల్‌గా గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మూడు జోన్ల అభివృద్ధి నమూనా, క్యూర్-ప్యూర్-రేర్ వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను వివరించారు. నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌కు ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, ఫార్మా రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. తెలంగాణ విజన్ లక్ష్యాలు పరస్పర సహకారానికి అనుకూలంగా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు.

**శంషాబాద్, గాగిల్లాపూర్‌లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ..**

శంషాబాద్, గాగిల్లాపూర్‌లో రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ తమ యూనిట్లను విస్తరించనున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి స్నైడర్ సీఈవో దీపక్ శర్మతో భేటీ అయి విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, డిజిటల్ విద్యుత్ నిర్వహణపై చర్చించారు. ఈ విస్తరణతో సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుంది. తెలంగాణ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఎదుగుతోందని అధికారులు తెలిపారు.



**భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్..**

తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక పెట్టుబడిని ఆకర్షించింది. యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడితో భారత్ ఫ్యూచర్ సిటీలో వంద మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ అనుకూల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. నిర్మాణ దశలోనే 3 వేల మందికి పైగా ఉపాధి లభించనుండగా, ప్రారంభం తర్వాత మరో 800 ఉద్యోగాలు కలగనున్నాయి. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో డిజిటల్ మౌలిక వసతులు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్–జీరో అభివృద్ధే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు.

# ధాన్యం దిగుబడి.. కొనుగోలులో రికార్డు

- 25 ఏండ్లలో రికార్డ్ సృష్టించిన తెలంగాణ
- డిమాండ్ కు అనుగుణంగా విదేశాలకు ధాన్యం ఎగుమతి
- ధాన్యం కొనుగోళ్లతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది
- బోనస్ తో కలిపి రూ. 18,532.98 కోట్ల మద్దతు ధర చెల్లింపు
- వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజామాబాద్, నల్లగొండ
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ముద్ర, బేగంపేట :



ధాన్యం దిగుబడితో పాటు ఖరీఫ్ సీజన్‌లో కొనుగోళ్లలోనూ తెలంగాణ దేశ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గడిచిన ఏళ్లలో ఇదే అత్యధిక రికార్డు అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో సంచలనాత్మక రికార్డు నమోదు చేసుకుందని చెప్పారు. పౌరసరఫరాలు, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణ రైతాంగం భాగస్వామ్యంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు మరే ఇతర రాష్ట్రాల్లో లేవన్నారు. 2020-21లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డును అధిగమించి, తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన తెలంగాణ కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు తొలిసారిగా తమ ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌తో కలిపి 14.20 లక్షల మంది రైతులకు మొత్తం రూ.18,532.98 కోట్లు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, సలహాలు, సూచనలను అధికారులు పాటించడంతో పాటు పటిష్ట ప్రణాళికతో రాష్ట్రవ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని తెలిపారు.

**విదేశాలకూ మన ధాన్యం..**

అధిక దిగుబడి, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేస్తామని మంత్రి చెప్పారు. అదే సమయంలో తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తామని, అలాగే అంతర్జాతీయ మార్కెట్‌కు బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.38 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం రికార్డని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించినట్లు వివరించారు. ప్రస్తుతం అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నెలకు ఆరు కిలోల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 3.17 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సన్నబియ్యం పంపిణీపై రూ.13,650 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించి, అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని తెలిపారు.

**మౌలిక సదుపాయాలపై ఫోకస్..**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పెరుగుతున్న నేపథ్యంలో నిల్వలకు అవసరమైన మౌలిక సదుపాయాల ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో సైలో పద్ధతిలో ఆధునిక గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఆధునీకరణతో తేమ నియంత్రణతో పాటు నష్టనివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రారంభంలో ఖర్చు ఎక్కువైనా దీర్ఘకాలంలో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. బీహార్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చే కార్మికులపై తెలంగాణలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని, అక్కడ ఎన్నికల సమయంలో కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని చెప్పారు. భవిష్యత్తులో అటువంటి పరిస్థితి రాకుండా స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించే మిల్లర్లకు పూర్తి సహకారం ఉంటుందని, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపే ఉండదన్నారు. పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని మిల్లుల పరిశ్రమను ప్రోత్సహించే విధివిధానాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు, పాడీ క్లీనర్లు ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.



# ఏంటీ సైట్ విజిట్..?

- నైనీ కోల్ బ్లాక్ టెండర్లపై తేలుస్తారా..?
- రంగంలోకి కేంద్రం

ముద్ర, తెలంగాణ బ్యూరో :

ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారులు సింగరేణి ప్రధాన కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టనున్నారు. ముఖ్యంగా సైట్ విజిట్ సర్టిఫికేట్ వంటి వివాదాస్పద నిబంధనలు ఎందుకు పెట్టారు? టెండర్ల ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే అంశాలపై వీరు లోతుగా దర్యాప్తు చేయనున్నారు. ఈ వ్యవహారంపై రాజకీయంగా తీవ్ర విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే స్పందిస్తూ నైనీ కోల్ బ్లాక్ టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సింగరేణి బోర్డును ఆదేశించారు. అక్రమాలకు తావులేకుండా, పారదర్శకత కోసం పాత టెండర్లను రద్దు చేసి, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ నిబంధనలకు అనుగుణంగా కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేబినెట్ మంత్రుల మధ్య వాటాల వివాదం వల్లే ఈ టెండర్లు రద్దయ్యాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం కేవలం పారదర్శకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతోంది.

**ఇప్పటికే టెండర్లు రద్దు చేసిన సింగరేణి..**

ప్రస్తుతానికి సింగరేణి యాజమాన్యం అధికారికంగా ఈ టెండర్ ప్రక్రియను నిలిపివేసింది. జనవరి 22 సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభం కావాల్సిన బిడ్డింగ్ ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి పేర్కొన్నప్పటికీ, కేంద్రం పంపుతున్న విచారణ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వ్యవహారం తదుపరి మలుపు తిరిగే అవకాశం ఉంది.

**సింగరేణిని దోచుకుంటున్నారని కిషన్ రెడ్డి ఆరోపణలు..**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం బంగారు బాతులా వాడుకుంటోందని విమర్శించారు. టెండర్లలో అవకతవకలు జరిగాయని, దీనిపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని ఆయన సవాల్ విసిరారు. జాతీయ స్థాయిలో బొగ్గు టెండర్లలో ఎక్కడా లేని సైట్ విజిట్ నిబంధనను కేవలం కొంతమంది కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ప్రవేశపెట్టారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రతినిధుల బృందం ఇప్పుడు సింగరేణి రికార్డులను పరిశీలించి, అధికారుల నుంచి వివరణ కోరనుంది.

# కోల్ టెండర్లపై విచారణకు మేం సిద్ధం

- సింగరేణిపై కేంద్రానికి అజమాయిషి లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ముద్ర, హైదరాబాద్ :

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నట్లుగా సింగరేణిలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. అయితే సింగరేణి విషయంలో రాష్ట్రాలపై కేంద్రానికి ఎలాంటి అజమాయిషీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర అని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బొగ్గు కుంభకోణం విషయంలో బీఆర్ఎస్ నేతలు పదే పదే సీబీఐ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. తెలంగాణలోకి సీబీఐ రాకుండా నిషేధించిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. సింగరేణిపై ప్రభుత్వాలు అదనపు భారాన్ని మోపుతున్నాయని అన్నారు. కొత్త నిబంధన పెట్టడం ముమ్మాటికీ తప్పేనని పేర్కొన్న కేంద్రమంత్రి, ఒకవేళ పెట్టినా సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోతుందని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లుగా సింగరేణిలో దోపిడీ జరిగిందనీ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ జరుగుతోందని ఆరోపించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**ఇవి తింటే మేలు..!**
రోజూ ఆకుకూరలు తప్పనిసరిగా తినాలి.
పండ్లు విటమిన్లకు మంచి మూలం.
ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.
చర్మ ఆరోగ్యం పెరుగుతుంది.
రోగాల నుంచి రక్షణ కలుగుతుంది.

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లా అవుట్..

- **ఆ జట్టు ప్లేస్ లో ఆడే టీమ్ ఇదే!**

**ముద్ర, న్యూ ఢిల్లీ**

ఐసీసీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పెద్దలు మంకు పట్టు వీడలేదు. పైగా భారతదేశంలో లేని భద్రతా లోపం కారణాలను చూపిస్తూ టి20 వరల్డ్ కప్ నుంచి తాము తప్పుకుంటున్నట్టు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇప్పటికే వేదికలు ఖరారు కావడం.. అన్ని ఏర్పాట్లు కూడా పూర్తి చేయడంతో ఇప్పటికిప్పుడు కొత్తగా షెడ్యూల్ మార్చడం ఇబ్బంది అవుతుందని ఐసిసి వెల్లడించింది. అయినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పెద్దలు మనసు మార్చుకోలేదు. కొద్దిరోజులుగా బంగ్లాదేశ్ లో పరిస్థితులు ఏమాత్రం బాగోలేవు. అక్కడ హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయి. హిందువులపై జరుగుతున్న దాడుల్లో ఇప్పటికే కొంతమంది చనిపోయారు. దీనిపై సహజంగానే భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితులను చక్కదిద్దాలని అక్కడి తాత్కాలిక ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలోనే భారత దేశంలో తాత్కాలిక ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం కోరింది. దానికి భారత ప్రభుత్వం ఒప్పుకోలేదు. దీనికి తోడు ఇటీవల కాలంలో బంగ్లాదేశ్ పాకిస్తాన్తో స్నేహం చేయడం మొదలుపెట్టింది. పాకిస్తాన్ నుంచి యుద్ధ నౌకలను కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించింది. అంతటితోనే బంగ్లాదేశ్ ఆగలేదు.. భారత్ మీద పీకల దాకా కోపంతో ఉన్న ఆ దేశ పెద్దలు క్రికెట్ లో లేని రాజకీయాలను తీసుకొచ్చారు. అక్కడికి తాత్కాలిక ప్రభుత్వం ఒత్తిడితో బంగ్లాదేశ్ క్రికెట్ పెద్దలు భారతదేశంలో నిర్వహించే టి20 వరల్డ్ కప్ పై కీలక నిర్ణయం తీసుకున్నారు. కొద్దిరోజులుగా తమ జట్టు ప్లేయర్లు భారతదేశంలో ఆడబోరని సంకేతాలు ఇచ్చారు. దీనిపై అనేక పర్యాయాలు ఐసిసికి ఫిర్యాదు చేశారు. పాకిస్తాన్ మాదిరిగానే.. తమ జట్టు ప్లేయర్లు కూడా శ్రీలంకలో ఆడతారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐసిసికి స్పష్టం చేసింది. అయితే ఐసీసీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వినతిని నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దీంతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పెద్దలు టి20 వరల్డ్ కప్ నుంచి తమ



జట్టు తప్పుకుంటున్నదని ప్రకటించారు.
బంగ్లాదేశ్ t20 వరల్డ్ కప్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్ జట్టు ఆడుతుందని icc పెద్దలు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ఐసీసీ టి20 వరల్డ్ కప్ లో ఆడే జట్లకు సంబంధించి ఇటీవల నిర్వహించిన సెలక్షన్ టోర్నీలలో స్కాట్లాండ్ జట్టు మెరుగైన ఆట తీరు ప్రదర్శించింది. బంగ్లాదేశ్ పక్కకు తప్పుకున్న నేపథ్యంలో.. ఆ తర్వాత స్థానంలో స్కాట్లాండ్ ఉన్న నేపథ్యంలో.. ఆ జట్టుకు ఆడే అవకాశం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇది ఏమైనప్పటికీ బంగ్లాదేశ్ తప్పుకోవడం.. స్కాట్లాండ్ జట్టుకు వరం లాగా మారింది.

# బెంగళూరు పంట పండిందిపో!

**ముద్ర, న్యూ ఢిల్లీ**

టి20లో ఎప్పుడో ఒకసారి బౌలర్లకు అద్భుతమైన ప్రదర్శన చేసే అవకాశం కలుగుతుంది. మిగతా అన్ని సందర్భాలలో బ్యాటర్ల ప్యారడైజ్ కొనసాగుతూ ఉంటుంది. బుధవారం నాగ్ పూర్ వేదికగా న్యూజిలాండ్ జట్టుతో జరిగిన తొలి టి20 మ్యాచ్లో టీం ఇండియా అదరగొట్టింది. 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 84 పరుగులు చేసి అదరగొట్టాడు. సూర్య కుమార్ యాదవ్ 32, రింకు సింగ్ 44* పరుగులతో విధ్వంసాన్ని సృష్టించారు.
టీమిండియా బ్యాటర్ల దూకుడుకు అటుకట్ట వేయడానికి న్యూజిలాండ్ కెప్టెన్ చేయని ప్రయత్నం అంటూ లేదు. ఏకంగా ఆరుగురు బౌలర్లను అతడు రంగంలోకి దింపాడు. కానీ, ఒక్క బౌలర్ మాత్రమే టీమిండియా బ్యాటర్లకు అడ్డుకట్ట వేయగలిగాడు. పరుగుల వరద పారకుండా చూడగలిగాడు. అతని పేరే జాకబ్ డఫీ. ఇతడేకంగా నాలుగు ఓవర్లు వేశాడు. కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చాడు. రెండు కీలకమైన వికెట్లను పడగొట్టాడు. ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యాను ఇతడు అవుట్ చేశాడు. ఒకవేళ కిషన్, పాండ్యా కనుక క్రీజులో ఉండి ఉంటే టీమ్ ఇండియా స్కోర్ మరింత పెరిగేది.
పరుగుల వరద పారుతున్న మైదానంలో ఆ స్థాయిలో బౌలింగ్ వేయడం అంటే మామూలు విషయం కాదు. పైగా ఖచ్చితమైన లైన్ అండ్ లెంత్ తో డఫీ బంతులు వేశాడు. డఫీ ని ఐపీఎల్ లో బెంగళూరు జట్టు సొంతం చేసుకుంది. ఇతడిని రెండు కోట్లకు దక్కించుకుంది.. భారత జట్టుతో జరిగిన మ్యాచ్ ద్వారా డఫి అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన చేసిన నేపథ్యంలో.. బెంగళూరు యాజమాన్యం అమితమైన ఆనందంతో ఉంది.. ఇప్పటికే బెంగళూరు జట్టులో హేజిల్ వుడ్, కృణాల్ పాండ్యా వంటి బౌలర్లు ఉన్నారు. గత ఏడాది ఐపిఎల్ లో బెంగళూరు విజేతగా నిలవడంలో వీరు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు వీరికి డఫి కూడా తోడైతే బెంగళూరు జట్టుకు తిరుగు ఉండదు.

# చరిత్ర సృష్టించిన పీవీ సింధు

- **500 విజయాలతో సరికొత్త మైలురాయి**

**ముద్ర, న్యూ ఢిల్లీ**



భారత స్టార్ షట్లర్, ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట సింధు అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో 500 మ్యాచ్‌ల్లో విజయం నమోదు చేసిన తొలి భారతీయ షట్లర్‌గా చరిత్రకెక్కింది. ఈ విజయంతో ప్రపంచ స్థాయిలోనూ 500 గెలుపులు సాధించిన ఆరో మహిళా షట్లర్‌గా సింధు రికార్డుల్లో చోటు దక్కించుకుంది.
ఇండోనేషియా మాస్టర్స్-2026 టోర్నీలో ప్రీ క్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్‌కు చెందిన ఫో లినే హోజ్‌మార్క్ జేర్‌ఫీల్డ్‌పై సింధు ఈ మైలురాయిని అందుకుంది. 43 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో 21-19, 21-18 స్కోర్లతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.
క్వార్టర్ ఫైనల్లో సింధు ప్రపంచ నాలుగో ర్యాంకర్, చైనాకు చెందిన చెన్ యూ ఫీని ఎదుర్కోనుంది. ఇప్పటివరకు వీరిద్దరి మధ్య జరిగిన 13 మ్యాచ్‌ల్లో చెన్ ఏడుసార్లు, సింధు ఆరుసార్లు గెలిచింది. చివరిసారి 2019లో చెన్‌పై సింధు విజయం సాధించింది. ఈసారి కూడా గెలిచి తన విజయాల సంఖ్యను మరింత పెంచుకోవాలనే లక్ష్యంతో సింధు బరిలోకి దిగనుంది. అదే టోర్నీలో భారత యువ షట్లర్ లక్ష్య సేన్ కూడా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. హాంకాంగ్ ఆటగాడు జేసన్ గునావన్‌పై 21-20, 21-11 తేడాతో గెలిచి తదుపరి దశకు చేరాడు.



# బంగ్లాదేశీయులూ.... ఈ అమ్మాయిలను చూసి నేర్చుకోండి..

**ముద్ర, న్యూ ఢిల్లీ**

ఈ కథనం చదివేముందు కింద ఒక వీడియో లింక్ ఉంది. అది ఒకసారి చూడండి. ఆ వీడియోలు దాదాపు ముగ్గురు ఫారిన్ క్రికెటర్లు.. అది కూడా మహిళా క్రికెటర్లు నడిరోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్నారు. వారు ఎంతో స్వేచ్ఛగా ఉదయపు నడకను ఆస్వాదిస్తున్నారు. పైగా తమ సొంత దేశంలో ఉన్నట్టే వారు స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ఈ ఉదాహరణ చాలు భారత్ ఎంత సురక్షితమైన దేశమో చెప్పడానికి.
భారతదేశంలో క్రికెటర్ల పై ప్రత్యక్ష దాడులు జరగలేదు. ముఖ్యంగా ఫారిన్ క్రికెటర్ల పై దాడులు ఎప్పుడూ జరగలేదు. వారు ప్రాణ భయంతో పరుగులు పెట్టలేదు. ఇక్కడ సెక్యూరిటీ లేదని ఏ దేశపు క్రీడాకారులు కూడా ఆరోపణలు చేయలేదు. భారతదేశంలో ఆడేందుకు తనకు ఇష్టం లేదని ఏ దేశపు జట్టు ఆటగాడు కూడా చెప్పలేదు. చివరికి పాకిస్తాన్ ప్లేయర్లు కూడా భారతదేశంలో ఆడటాన్ని ఆస్వాదిస్తామని చెప్పారు. అవకాశం ఉంటే ఆ దేశంలో ఆడేందుకు తమకు ఆసక్తి ఉందని వెల్లడించారు. కానీ, లేకి బంగ్లాదేశ్ క్రికెటర్లకు మాత్రం ఇది అర్థం కావడం లేదు. భారతదేశం ఎంత స్వేచ్ఛాయుతమైన దేశమో, ఎంతటి భద్రత ఉన్న దేశమో అర్థం కావడం లేదు... భారతదేశంలో టి20 వరల్డ్ కప్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. తాము అక్కడ ఆడలేమని.. తాము ఆడే మ్యాచ్ లు మొత్తం తటస్థ వేదికలలో నిర్వహించాలని బంగ్లాదేశ్ గొంతెమ్మ కోరికలు కోరుతోంది.
వాస్తవానికి బంగ్లాదేశ్లో కొద్ది రోజులుగా అల్లర్లు చెలరేగుతున్నాయి. హిందువులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో హిందువులను అంతం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ లో జరుగుతున్న పరిణామాలపై భారత్ సహజంగానే ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులపై దాడులు జరగకుండా చూడాలని ఆ ప్రభుత్వాన్ని కోరింది. ఆ తర్వాత ఐపీఎల్లో కోల్ కతా జట్టు తరఫున ఆడుతున్న బంగ్లాదేశ్ బౌలర్ ను తప్పించింది. దీనిని సాకుగా చూపించిన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు భారతదేశంలో టి20 వరల్డ్ కప్ ఆడేది లేదని స్పష్టం చేసింది. ఐసీసీ అనేక పర్యాయాలుగా హెచ్చరించినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మారడం లేదు.
ప్రస్తుతం మన దేశం వేదికగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ నడుస్తోంది. బెంగళూరు జట్టు తరఫున లారెన్ బెల్, జార్జియా, నడైన్ డీ క్లార్క్ వంటి ఉమెన్ క్రికెటర్లు ఆడుతున్నారు. వారు వడోదరాకు ఓ మ్యాచ్ సందర్భంగా వచ్చారు. ఈ క్రమంలో వడోదరనగరంలో మార్నింగ్ వాక్ కూడా చేశారు. ఆ సమయంలో వారి పక్కన సెక్యూరిటీ అంతంత మాత్రం గానే ఉంది. పైగా వారు తమ సొంత దేశంలో ఉన్నట్టుగానే ప్రవర్తించారు. కానీ, బంగ్లాదేశ్ పురుష క్రికెటర్లకు ఇది అర్థం కావడం లేదు. పైగా భారతదేశం మీద రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసే ముందు ఈ పారింది మహిళా క్రికెటర్లు ఆస్వాదిస్తున్న స్వేచ్ఛను బంగ్లాదేశ్ పురుష క్రికెటర్లు చూడాలని నెటిజన్లు సూచిస్తున్నారు

# గౌతమ్ గంభీర్‌కు శశిథరూర్ ప్రశంసలు

**ముద్ర, న్యూ ఢిల్లీ**



టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ, కాంగ్రెస్ అసమ్మతి నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మాత్రం భిన్నంగా స్పందించారు. దేశంలో ప్రధానమంత్రి తర్వాత అత్యంత కష్టతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్న వ్యక్తి గంభీరేనని పేర్కొంటూ ఆయన ప్రశంసలు కురిపించారు.
నాగ్‌పూర్‌లో బుధవారం జరిగిన భారత్-న్యూజిలాండ్ తొలి టీ20 మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన శశిథరూర్, మ్యాచ్‌కు ముందు గంభీర్‌తో భేటీ అయ్యారు. అనంతరం 'ఎక్స్' వేదికగా గంభీర్‌తో దిగిన ఫొటోను పంచుకుంటూ స్పందించారు. రోజూ లక్షలాది మంది విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ గంభీర్ ప్రశాంతంగా, ధైర్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఆయన నిశ్శబ్ద సంకల్పం, సమర్థ నాయకత్వం అభినందనీయమని చెబుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. దీనికి గంభీర్ కృతజ్ఞతలు తెలుపుతూ సమాధానం ఇచ్చారు.
నాగ్‌పూర్ పర్యటనలో భాగంగా ఆంత్రప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శశిథరూర్, అదే రోజు రాత్రి విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ టీ20 మ్యాచ్‌ను ఆస్వాదించారు. మ్యాచ్ అనంతరం మరో పోస్టు చేస్తూ, న్యూజిలాండ్ జట్టు చేసిన పరుగుల కంటే తాను ఎక్కువ సెల్ఫీలు ఇచ్చానని చమత్కరించారు. క్రికెట్ అభిమానుల మధ్య మ్యాచ్ చూడటం ఎంతో ఆనందంగా అనిపించిందని తెలిపారు.
ఇటీవల కాలంలో శశిథరూర్ తన పార్టీ కాంగ్రెస్‌తో కొంత దూరంగా వ్యవహరిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బందులు తెచ్చారని విమర్శలు వచ్చాయి. తాజాగా బీజేపీ మాజీ ఎంపీ అయిన గంభీర్‌ను కలవడం, ఆయనపై ప్రశంసలు కురిపించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. గంభీర్ హెడ్‌కోచ్‌గా వచ్చిన తర్వాత టీమిండియా ప్రదర్శనపై విమర్శలు వినిపిస్తున్న తరుణంలో, శశిథరూర్ ఆయనకు మద్దతుగా నిలవడం రాజకీయ, క్రీడా వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ భేటీపై కాంగ్రెస్ నేతలు ఇంకా స్పందించలేదు.

# రోహిత్ శర్మకు గౌరవ డాక్టరేట్

**ముద్ర, న్యూ ఢిల్లీ**



భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కనుంది. క్రీడారంగంలో ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ముంబైలోని డీవై పాటిల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ (డీ.లిట్.) ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. జనవరి 24, 2026న జరగనున్న యూనివర్సిటీ 10వ కాన్వొకేషన్ కార్యక్రమంలో ఈ పట్టాను అందజేయనున్నారు.
అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించడంలో రోహిత్ శర్మ కీలక పాత్ర పోషించారు. ఆయన కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ టైటిళ్లు సాధించింది. కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ తర్వాత ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా రోహిత్ ప్రత్యేక గుర్తింపు పొందారు.
బ్యాట్స్‌మన్‌గా రోహిత్ శర్మ పలు అరుదైన రికార్డులు నెలకొల్పారు. ఇప్పటివరకు 67 టెస్టులు, 282 వన్డేలు, 159 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి టెస్టుల్లో 4301 పరుగులు, వన్డేల్లో 11,577 పరుగులు, టీ20ల్లో 4231 పరుగులు చేశారు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు ఆయన పేరిట ఉంది. టెస్టులు, టీ20 ఫార్మాట్‌లకు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతం వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

# గురువు రికార్డు దాటిన యువ ఓపెనర్

**ముద్ర, న్యూ ఢిల్లీ**



టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి తన బ్యాటింగ్ శక్తిని చాటాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అతడి దూకుడైన ఇన్నింగ్స్ మ్యాచ్ దిశనే మార్చేసింది. నాగ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో కివీస్ బౌలర్లపై అభిషేక్ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన అభిషేక్, మొత్తం 35 బంతుల్లో 84 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 8 భారీ సిక్సర్లు ఉన్నాయి. సెంచరీకి చేరువైనప్పటికీ స్వల్ప తేడాతో ఆ ఘనత మిస్ అయినా, అతడి ఆట న్యూజిలాండ్ బౌలింగ్‌ను పూర్తిగా చిత్తుచేసింది.
ఈ ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ మరో అరుదైన ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 అంతర్జాతీయాల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత ఆటగాళ్ల జాబితాలో తన గురువు యువరాజ్ సింగ్‌ను దాటాడు. యువరాజ్ 51 ఇన్నింగ్స్‌లలో 74 సిక్సర్లు కొట్టగా, అభిషేక్ కేవలం 33 ఇన్నింగ్స్‌ల్లోనే 81 సిక్సర్లకు చేరడం విశేషం. తక్కువ మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును అధిగమించడం అతడి హిట్టింగ్ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.
ప్రస్తుతం భారత తరఫున టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ ఆరో స్థానానికి చేరాడు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ అతడికి ముందున్నారు. ఇదే ఫామ్ కొనసాగితే మరిన్ని రికార్డులు అతడి ముందే నిలవడం ఖాయమన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మ్యాచ్‌లో అభిషేక్ ఇన్నింగ్స్ టీమిండియాకు దూకుడైన ఆరంభాన్ని ఇచ్చింది. 2026 టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుంటే, జట్టుకు అతడు ఎంత కీలకమో మరోసారి స్పష్టమైంది. క్రీజులో ఉన్నంతసేపు పరుగులు వేగంగా వస్తాయన్న నమ్మకాన్ని అభిషేక్ మరోసారి బలపరిచాడు.

# అజామూ.. ఏంటయ్యా ఇదీ..

- **37 సెకన్లలో 85 సార్లు.. ఇంగ్లీష్ ముక్క రాలేదు**
- **పాక్ ప్లేయర్‌ను ఆడుకుంటున్న నెటిజన్లు**

**ముద్ర, న్యూ ఢిల్లీ**

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ నుంచి పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజం అర్థాంతరంగా వైదొలగాల్సి వచ్చింది. అంతర్జాతీయ మ్యాచ్‌ల కారణంగా సిడ్నీ సిక్సర్స్ జట్టు బాబర్‌ను రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా సిడ్నీ సిక్సర్స్ జట్టు బాబర్ అనుభవాలను పంచుకుంటూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే, ఈ 37 సెకన్ల వీడియోనే ఇప్పుడు బాబర్ కొంపముంచింది. ఆ వీడియోలో బాబర్ మాట్లాడుతున్నప్పుడు ప్రతి మాటకు మధ్యలో ఆ.. ఆ..అంటూ తడబడటం నెటిజన్ల కంటికి చిక్కింది. ఒక యూజర్ అయితే లెక్కకట్టి మరీ "37 సెకన్లలో 85 సార్లు ఆ..ఆ..అని అన్నాడు" అంటూ పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది.
బాబర్ ఆజం ఇంగ్లీష్ మాట్లాడటంలో ఇబ్బంది పడటం ఇదేం మొదటిసారి కాదు. గతంలోనూ పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్లలో ఆయన ప్రతిదానికీ డెఫినెట్లీ అనే పదాన్ని వాడటంపై విపరీతమైన మీమ్స్ వచ్చాయి. సరైన స్ట్రైక్ రేట్ లేక, ఇంగ్లీష్ రాక బాబర్ ఎప్పుడూ సోషల్ మీడియాలో టార్గెట్ అవుతూనే ఉంటారు. తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో ఆయన మాటతీరు చూస్తుంటే, మాట్లాడటానికి పడుతున్న పాట్లు నవ్వు తెప్పిస్తున్నాయని అభిమానులే కామెంట్స్ చేస్తున్నారు. ఆటలో ఎంత తోపు అయినా, కమ్యూనికేషన్ విషయంలో బాబర్ కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.
మరోవైపు బిగ్ బాష్ లీగ్‌లో బాబర్ ప్రదర్శన కూడా ఏమంత ఆశాజనకంగాలేదు. సిడ్నీ సిక్సర్స్ తరఫున ఆడిన 11 మ్యాచుల్లో కేవలం 202 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో అతని సగటు 22.44 కాగా, స్ట్రైక్ రేట్ మరీ ఘోరంగా 103.06 గా ఉంది. టీ20 క్రికెట్‌లో ఇంత తక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడటంపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు కూడా పెదవి విరిచారు. ఒక ఇన్నింగ్స్‌లో సున్నా పరుగులకే అవుట్ అవ్వడం అతని ఫామ్ ఎంత అధ్వాన్నంగా ఉందో చెబుతోంది. కేవలం రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే చేసిన బాబర్, జట్టు విజయంలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు.అంతర్జాతీయ కెరీర్‌లో బాబర్ ఆజంకు మంచి రికార్డులే ఉన్నాయి. ఇప్పటివరకు ఆయన 61 టెస్టులు, 140 వన్డేలు, 136 టీ20లు ఆడి వేల సంఖ్యలో పరుగులు సాధించారు. కానీ, ఇటీవల కాలంలో ఆయన



ఫామ్ పడిపోవడం, కెప్టెన్సీ నుంచి తప్పుకోవాల్సి రావడం వంటి పరిణామాలు ఆయన్ని మానసికంగా దెబ్బతీశాయి. మైదానంలో పరుగులు రాక, బయట మాటలు రాక బాబర్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ ట్రోలింగ్ నుంచి బయటపడాలంటే ఆయన కేవలం బ్యాట్‌తోనే కాకుండా, తన కమ్యూనికేషన్ స్కిల్స్ మీద కూడా దృష్టి పెట్టాలని నెటిజన్లు ఉచిత సలహాలు ఇస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## ఒత్తిడిని తగ్గించుకోండి

అవసరం లేని ఆలోచనలు తగ్గించాలి.
ధ్యానం లేదా యోగా అలవాటు చేసుకోవాలి.
ప్రియమైన వారితో మాట్లాడాలి.
పాజిటివ్ ఆలోచనలు పెంచుకోవాలి.
మానసిక ఆరోగ్యం బలపడుతుంది.



### సంక్రాంతికి వస్తున్నాం
# సీక్వెల్‌కు బ్రేక్

**వెంకటేష్‌తో అనిల్ రావిపూడి కొత్త కథ**

సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి వరుస విజయాలు అందిస్తోంది. గత సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఆయన, దాదాపు రూ.300 కోట్ల గ్రాస్ వసూలు చేసిన హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. అది వెంకటేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ సంక్రాంతికి 'మన శంకర ప్రసాద్ గారు'తో మరో సూపర్ హిట్ అందుకున్నారు. ఈ విజయాల నేపథ్యంలో వచ్చే సంక్రాంతికి కూడా అనిల్ రావిపూడి సినిమా ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగింది. వెంకటేష్‌తో మరోసారి సినిమా చేయనున్నారని, అదే 'సంక్రాంతికి వస్తున్నాం' సీక్వెల్ అవుతుందని అంచనాలు ఏర్పడ్డాయి. సీక్వెల్‌కు సంబంధించిన కథా లైన్ సిద్ధంగా ఉందన్న మాటలు కూడా వినిపించాయి. అయితే తాజాగా ఈ సీక్వెల్‌పై క్లారిటీ వచ్చింది. వెంకటేష్‌తో అనిల్ రావిపూడి సినిమా దాదాపు ఖరారైనప్పటికీ, అది 'సంక్రాంతికి వస్తున్నాం' సీక్వెల్ కాదని తేలింది. పూర్తిగా కొత్త కథతో, కొత్త ప్రపంచాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతున్నట్లు అనిల్ రావిపూడి వెల్లడించారు. సీక్వెల్ చేయొచ్చనే ఆలోచన ఉన్నప్పటికీ, ఈసారి కొత్త కథ చెప్పాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.
ఈ కొత్త కథకు సంబంధించిన లైన్‌ను వెంకటేష్‌కు ఇప్పటికే వినిపించినట్టు సమాచారం. ఆయన నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలిసింది. మే నెల నుంచి చిత్రీకరణ ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అంతకుముందు వెంకటేష్–త్రివిక్రమ్ సినిమా పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త ప్రాజెక్ట్‌ను 2027 సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫిబ్రవరిలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను మరోసారి క్యాష్ చేసుకునే దిశగా అనిల్ రావిపూడి అడుగులు వేస్తుండటంతో, ఈ సినిమాపై పరిశ్రమలో అంచనాలు పెరుగుతున్నాయి.



# సమ్మర్ సీజన్‌లో మెగా హీరోల సందడి



ఈ ఏడాది సమ్మర్ సీజన్‌లో మెగా కుటుంబం నుంచి వరుసగా నాలుగు చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో మెగా హీరోల సినిమాలు థియేటర్లలోకి రానుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న భారీ చిత్రం మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. మరోవైపు సాయి ధరమ్ తేజ్ నటించిన చిత్రం రామ్ చరణ్ చిత్రానికి ముందే ప్రేక్షకుల ముందుకు రానుంది. పునరాగమనంగా ఈ సినిమాకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.
ఏప్రిల్‌లో పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతోంది. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో వరుణ్ తేజ్ చిత్రం కూడా సమ్మర్ రేసులో నిలవనుంది. వరుస విడుదలలతో ఈ సమ్మర్‌ను మెగా హీరోలు తమదిగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. థియేటర్లలో మెగా సందడి తప్పదన్న అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# ఎస్ జానకి ఇంట విషాదం



సీనియర్ గాయని ఎస్. జానకి ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ (65) గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు దిగ్భ్రాంతికి గురయ్యారు.
మురళీకృష్ణ మరణం తనను షాక్‌కు గురిచేసిందని సింగర్ చిత్ర సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.భరతనాట్యంలో ప్రావీణ్యం ఉన్న మురళీకృష్ణ తెలుగు, మలయాళ చిత్రాల్లో నటించారు. 'వినాయకుడు', 'మల్లెపువ్వు' చిత్రాల్లో కనిపించారు. 'కూలింగ్ గ్లాస్' అనే మలయాళ చిత్రానికి రచయితగా పనిచేశారు. గతంలో జానకి ఆరోగ్యంపై వచ్చిన వార్తలను మురళీకృష్ణ ఖండించారు. మురళీకృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# పుష్ప 3 కోసం స్పెషల్ ఆఫీస్!




ది ర్యాంపేజ్' కోసం ప్రేక్షకుల్లో అప్పుడే ఆసక్తి మొదలైపోయింది. హీరో అల్లు అర్జున్‌దర్శకుడు సుకుమార్ వేర్వేరు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నా? 'పుష్ప 3' మాత్రం నిరంతరం సోషల్ మీడియాలో చర్చకొస్తూనే ఉంది. ఆ సినిమా ఎప్పుడు మొదలు పెడతారు? ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అన్న అంశాలపై రకరకాల గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రాజెక్ట్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మూడవ భాగంలో పుష్పరాజ్ తన సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి ఎలా విస్తరించాడు ? ప్రత్యర్థులపై అతని దండయాత్ర ఎలా సాగిందనేది ప్రధానాంశంగా ఉండబోతోందిట.
బన్నీ పాత్ర 'పుష్ప' రెండు భాగాలను మించి రెట్టింపు ఎనర్జీతో సాగుతుందని వినిపిస్తోంది. అప్పుడే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలైనట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే హైదరాబాద్‌లో 'పుష్ప 3' కోసం ప్రత్యేకంగా ఒక ఆఫీస్‌ను ఏర్పాటు చేసారట. సుకుమార్ అండ్ టీమ్ ఆఫీస్ అడ్డాగా పని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి సుకుమార్ రైటింగ్ టీమ్ స్పెషల్ గా వర్క్ చేస్తోందట. సుకుమార్ ఆదేశాల మేరకు లీడ్స్ వదిలిన పాయింట్స్ నుంచి స్టోరీ ని బిల్డ్ చేస్తున్నారట. చిత్తూరు జపాన్ కథని ఎలా తీర్చిదిద్దితే బాగుంటుంది అన్న ఐడియా పై స్టోరీ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అవసరం మేర స్పాట్ కు వెళ్లడం..అవసరమైన సమాచారం సేకరించడం వంటివి వెంట వెంటనే జరుగుతున్నాయట. టీమ్ అంతా ఐక్యంగా పని చేయడం కోసమే సుకుమార్ మిగతా సినిమాలతో సంబంధం లేకుండా 'పుష్ప 3' కోసమే ప్రత్యేకంగా ఆఫీస్ తీసినట్లు తెలుస్తోంది. సుకుమార్ పుష్పని ఓ యూనివర్స్ గా మార్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇప్పటికే కోలీవుడ్, టాలీవుడ్ లో యూనిర్స్ ట్రెండ్ కొనసాగుతోంది. అందులో 'పుష్ప' పాన్ ఇండియాలో 2400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ప్రాజెక్ట్ .
కాబట్టి యూనివర్స్ క్రియేట్ చేసినా ఆలోచించాల్సిన పనిలేదు. 'పుష్ప 3' హీరో బన్నీ నే. అందులో ఎలాంటి సందేహం లేదు.
2028లో ఈ ప్రాజెక్ట్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఒక వేళ యూనివర్స్ లోకి తీసుకొస్తే గనుక అక్కడ నుంచి హీరోలే మారే అవకాశం ఉంది. ప్రస్తుతం సుకుమార్ రామ్ చరణ్ తో తెరకెక్కించే సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. అటు బన్నీ అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. వీళ్లిద్దరు ఫ్రీ అవ్వడానికి ఎలా లేదన్నా ఏడాదిన్నర సమయం పడుతుంది.



### సీనియర్ హీరోల్లో ఎవరు
# బాక్సాఫీస్ కింగ్?

టాలీవుడ్‌లో కుర్ర హీరోల సందడి ఎంత ఉన్నా, బాక్సాఫీస్ దగ్గర అసలైన సౌండ్ మాత్రం 'సీనియర్ స్టార్స్' నుంచే వస్తోంది. వయసు పెరుగుతున్నా వసూళ్ల వేటలో తామేం తక్కువ కాదని మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్ మరోసారి నిరూపించారు. ముఖ్యంగా డే 1 వరల్డ్ వైడ్ గ్రాస్ కలెక్షన్లలో ఈ సీనియర్లు సృష్టించిన ఇంపాక్ట్ ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టాక్ ఎలా ఉన్నా ఓపెనింగ్స్ రాబట్టడంలో వీరి స్టామినా మరో లెవెల్లో ఉంది.
మెగాస్టార్ చిరంజీవి ఈ లిస్టులో టాప్ పొజిషన్లలో ఉంటూ తన బాక్సాఫీస్ ఇమేజ్‌ను కాపాడుకుంటున్నారు. రీసెంట్ బ్లాక్ బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' కలెక్షన్ల వర్షం కురిపించింది. ఈ సినిమా మొదటి రోజే ఏకంగా రూ. 84 కోట్ల గ్రాస్ సాధించి చిరు కెరీర్‌లోనే సెకండ్ బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. పీరియడ్ డ్రామా 'సైరా నరసింహారెడ్డి' సాధించిన రూ. 85 కోట్ల రికార్డుకు ఇది అత్యంత చేరువగా రావడం విశేషం. ఇక నందమూరి బాలకృష్ణ విషయానికి వస్తే, 'అఖండ' నుంచి ఆయన బాక్సాఫీస్ లెక్కలు పూర్తిగా మారిపోయాయి. రీసెంట్‌గా వచ్చిన 'డాకు మహారాజ్' మొదటి రోజే రూ. 51.85 కోట్లు కొల్లగొట్టి బాలయ్య మాస్ పవర్‌ను చూపించింది. అలాగే 'వీరసింహారెడ్డి', 'అఖండ 2' సినిమాలు కూడా యాభై కోట్ల మార్కును టచ్ చేస్తూ బాలకృష్ణను ఈ ఎలైట్ లిస్టులో నిలబెట్టాయి. మాస్ ఆడియన్స్‌లో ఆయనకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ఈ అంకెలే చెబుతున్నాయి. విక్టరీ వెంకటేష్ కూడా ఈ రేసులో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా మొదటి రోజు రూ. 40.05 కోట్ల గ్రాస్ సాధించి వెంకీ కెరీర్‌లో బెస్ట్ ఓపెనింగ్స్‌ను నమోదు చేసింది. ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఆయనకున్న గ్రిప్, పండగ సీజన్ అడ్వాంటేజ్ కలిసి ఈ భారీ వసూళ్లను సాధ్యం చేశాయి. సీనియర్ హీరోల్లో వెంకటేష్ సైలెంట్‌గా వచ్చి సాలిడ్ నంబర్స్ సాధిస్తున్నారు. మొత్తానికి టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సీనియర్ల హవా ఇప్పట్లో తగ్గేలా లేదు. కంటెంట్ కరెక్ట్‌గా కుదిరితే వీరు సృష్టించే విధ్వంసం ఏ రేంజ్‌లో ఉంటుందో ఈ డే 1 కలెక్షన్లు ఒక ఎగ్జాంపుల్. కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ, వందల కోట్ల మార్కెట్‌ను శాసిస్తున్న ఈ సీనియర్ల లైనప్ చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు కనుమరుగవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.
టోటల్ డే 1 వరల్డ్ వైడ్ గ్రాస్ లిస్ట్ సైరా నరసింహారెడ్డి: రూ. 85 కోట్లు మన శంకరవరప్రసాద్ గారు: రూ. 84 కోట్లు ఆచార్య: రూ. 52 కోట్లు డాకు మహారాజ్: రూ. 51.85 కోట్లు ఖైదీ నంబర్ 150: రూ. 50.50 కోట్లు వీరసింహారెడ్డి: రూ. 50.10 కోట్లు వాల్తేరు వీరయ్య: రూ. 49.10 కోట్లు అఖండ 2: రూ. 48.85 కోట్లు సంక్రాంతికి వస్తున్నాం: రూ. 40.05 కోట్లు



### సంక్రాంతికి వస్తున్నాం
# హిందీ రీమేక్‌లో రాశీ ఖన్నా?

విక్టరీ వెంకటేష్ హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' హిందీ రీమేక్‌పై ఆసక్తికర చర్చ సాగుతోంది. 2025 సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, ప్రాంతీయ చిత్రాల్లో సరికొత్త రికార్డులు నమోదు చేసింది.
ఈ సినిమాను హిందీలో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో, కాస్టింగ్‌పై కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్ హీరోగా ఈ రీమేక్ రూపొందనుందని సమాచారం. తెలుగులో వెంకటేష్ పోషించిన మాజీ పోలీస్ అధికారి పాత్రను హిందీలో అక్షయ్ కుమార్ చేయనున్నట్లు తెలుస్తోంది.
ఇక భార్య పాత్ర కోసం ఐశ్వర్య రాజేష్ చేసిన పాత్రకు బాలీవుడ్ నటి విద్యా బాలన్‌ను ఎంపిక చేసినట్లు టాక్. మరో కీలకమైన గ్లామరస్ పాత్ర కోసం టాలీవుడ్ హీరోయిన్ రాశీ ఖన్నాను ఖరారు చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. తెలుగులో మీనాక్షి చౌదరి చేసిన పాత్రను హిందీలో రాశీ ఖన్నా పోషించనున్నారని ప్రచారం జరుగుతోంది. మొదట ఈ పాత్రకు మీనాక్షి చౌదరినే పరిశీలించినప్పటికీ, హిందీలో రాశీకి ఉన్న గుర్తింపు దృష్ట్యా ఆమె వైపు మేకర్స్ మొగ్గు చూపినట్లు సమాచారం.
ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్స్ వైఫ్ మధ్య నలిగిపోయే మాజీ పోలీస్ అధికారి కథతో రూపొందిన ఈ చిత్రం, వెంకటేష్ మార్క్ కామెడీతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కథ నార్త్ ఆడియన్స్‌కు కూడా కనెక్ట్ అవుతుందని భావిస్తున్న మేకర్స్, బాలీవుడ్ నేటివిటీకి తగ్గట్టు మార్పులు చేసి త్వరలోనే షూటింగ్ ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.హిందీ చిత్ర పరిశ్రమలోనే కెరీర్ ప్రారంభించిన రాశీ ఖన్నా, 'మద్రాస్ కేఫ్'తో తెరంగేట్రం చేసి, ఆపై తెలుగులో 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. 'రుద్ర', 'ఫర్జీ' వంటి వెబ్ సిరీస్‌లతో బాలీవుడ్‌లోనూ మంచి పేరు సంపాదించింది. ప్రస్తుతం తెలుగులో 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు హిందీ, తమిళ ప్రాజెక్టులలో నటిస్తోంది. ఈ క్రమంలోనే 'సంక్రాంతికి వస్తున్నాం' హిందీ రీమేక్ అవకాశం దక్కినట్లు సమాచారం. ఈ రీమేక్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

### చిరు మూవీలో
# కృతిశెట్టి

'వాల్తేరు వీరయ్య' తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవి, దర్శకుడు బాబీ కలిసి మరో సినిమా చేయబోతున్నారు. . కూతురు సెంటిమెంట్ ప్రధానంగా సాగే కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. ఇందులో కూతురు పాత్ర కోసం కృతిశెట్టి ఎంపిక దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోనే మలయాళ స్టార్ మమ్ముట్టి కూడా ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన రానుంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com